ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739

# తెలుగోడు

EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 76 | సోమవారం 15 డిసెంబర్ 2025 | పేజీలు - 8 వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

**సంజన లైఫ్‌కేర్ ఫార్మసీ +**




మా వద్ద అన్ని రకాల ప్రముఖ కంపెనీల మందులు లభించును..
ఎమ్మార్పీ ధరలకంటే ప్రతి మెడిసిన్‌పై 10శాతం నుండి 30శాతం వరకు ధర తగ్గించి అమ్మబడును..
అత్యవసర పరిస్థితిలో డోర్ డెలివరీ కూడా ఇవ్వబడును...

బస్టాండ్ సర్కిల్, మెయిన్‌రోడ్, నల్లమాడ.. శ్రీ సత్యసాయి జిల్లా..
సెల్ - 8886920715

## ఏపిలోని జొన్నగిరి, పగిడిరాయి మధ్య

# బంగారు నిక్షేపాలు

**కర్నూలు జిల్లాలో బంగారం తవ్వకాలు ప్రారంభం**

**1477ఎకరాల్లో తవ్వకాలకు అనుమతులు**

**6000 టన్నుల బంగారం వెలికి తీయాలని లక్ష్యం**



**కర్నూలు, డిసెంబర్ 14 :**
భారతదేశంలో బంగారానికి ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. ప్రస్తుతం బంగారం ధర సామాన్యులు కొనుగోలు చేయలేనంత భారీగా పెరిగింది. అందని ద్రాక్షగా మారిన బంగారాన్ని కొనుగోలు చేయడానికి ఇబ్బంది పడే సామాన్యులకు మనదేశంలోనే దేశీయంగా బంగారం వెలికితీత పనులు ప్రారంభం కావడం భవిష్యత్తులో బంగారం ధరలు తగ్గుతాయనే ఆశలకు కారణంగా మారింది. మన దేశంలో ముఖ్యంగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ జిల్లాలోని కర్నూలు జిల్లాలో బంగారం తవ్వకాలు ప్రారంభమయ్యాయి. తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించడంతో పాటు ఇక్కడ ఉన్న బంగారు నిల్వలను నిర్ధారించారు. పగిడిరాయి జొన్నగిరి మధ్య పరిశోధనలు జరిపిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా బంగారు నిక్షేపాలు ఉన్నట్టు వెల్లడించింది. జొన్నగిరి పగిడిరాయి మధ్య 1477 ఎకరాలలో తవ్వకాలకు జియో మైసూర్ కంపెనీ అనుమతులు పొంది పనులను ప్రారంభించింది. ఇక్కడ ఒక టన్ను మట్టి నుండి 1.5 నుండి రెండు గ్రాముల వరకు పసిడి ఉత్పత్తి అవుతుంది. టన్ను మట్టి నుండి 1.5 నుండి రెండు గ్రాముల వరకు బంగారం వెలికి తీయాలంటే సుమారు 5000 రూపాయలు ఖర్చవుతుందని అధికారులు చెప్పారు. 6000 టన్నుల బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంతో వున్నారు. వెయ్యి టన్నుల మట్టి శుద్ధి చేస్తే దాదాపు 700 గ్రాముల బంగారం లభిస్తుందని సంస్థ యాజమాన్యం చెప్తుంది. మొత్తం రాబోయే 10 సంవత్సరాలలో ఈ మైనింగ్ సంస్థ ఏపీలోని జొన్నగిరి (మిగతా 2లో)

# బే షరతుగా షరతులు

- తమ లక్ష్యాలు నెరవేరక పోతే భూములు వెనక్కి తీసుకోకూడదు..
- గడువులోపు కంపెనీ ప్రారంభం కాకపోతే ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకూడదు..
- చేసేది లేక రాష్ట్ర ప్రభుత్వం ఓకే అంటున్న వైనం..
- ప్రభుత్వానికే సవా లక్ష షరతులు పెడుతున్న పలు కంపెనీలు..




**అమరావతి, డిసెంబర్ 14 :**
ఏపీలో ఐటీ సంస్థల్ని, పెట్టుబడుల్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఆయా సంస్థలకు వరంగా మారుతున్నాయి. ఓవైపు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రానికి వస్తామంటూనే, మరోవైపు సవాలక్ష షరతులు పెడుతున్నాయి. అలాగే రాయితీలు కూడా కోరుతున్నాయి. ఇవన్నీ ఇచ్చాక కూడా తమ లక్ష్యాలు నెరవేరకపోతే కేటాయించిన భూములు రద్దు చేయొద్దంటూ ప్రభుత్వానికి షరతులు పెడుతున్నాయి. తాజాగా వైజాగ్ కు వచ్చిన కాగ్నిజెంట్ సంస్థ ఇదే చేసింది.విశాఖలో కాగ్నిజెంట్ ప్రస్తుతానికి ఓ తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసుకుంది. ఇందులో తమ కార్యకలాపాలు ప్రారంభించింది. అలాగే శాశ్వత కార్యాలయం ఏర్పాటు కోసం ప్రభుత్వానికి విజప్తి (మిగతా 2లో)

# వృక్షో రక్షతి - రక్షిత:

**పర్యావరణ పరిరక్షణలో దివ్య వృక్షాల ప్రాజెక్టుకు టిటిడి శ్రీకారం..**

**ధ్వజ స్తంభాలకు అవసరమైన వృక్షాల పెంపకం..**

**100 ఎకరాల్లో పెంచే దిశగా ...**



**తిరుపతి, డిసెంబర్ 14 :**
దేశంలోనే తొలిసారిగా ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు దిశానిర్దేశం చేసే దివ్య వృక్షాల ప్రాజెక్టుకు టీటీడీ శ్రీకారం చుట్టింది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని చేపట్టనుంది. ప్రాచీన, ఆగమ శాస్త్రాలకు అనుగుణమైన దేవాలయాల్లో అత్యంత (మిగతా 2లో)

# టిడిపిలో రచ్చో.. రచ్చ

**విజయవాడ ఎంపీ, తిరువూరు ఎమ్మెల్యేల మధ్య పోస్టుల రచ్చ..**

**తిరువూరు ఎమ్మెల్యే రాసలీల ఫోటోలు ...**

**అధిష్టానం హెచ్చరించినా ఫలితం శూన్యం..**

**వ్యక్తిగత పోస్టులతో పార్టీ పరువు బజారుకి..**



**అమరావతి, డిసెంబర్ 14 :**
ఏపీలో అధికార టీడీపీలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మధ్య సాగుతున్న పోరు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే ఇరు వర్గాల మధ్య క్షేత్ర స్థాయిలో తీవ్ర మాటల యుద్ధం (మిగతా 2లో)





## జిల్లా రాజకీయాల్లో రాణిస్తున్న

# ఆవుటాల

## వెంకట రమణారెడ్డి

- 1977 నుండి క్రియాశీలక రాజకీయాల్లో రాణిస్తున్న ఆవుటాల..
- ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడిగా పదవులు..
- నియోజకవర్గ స్థాయి నాయకుల గెలుపులో భాగస్వామ్యం..
- జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులుగా పలు సేవలు..
- తమ నాయకుడు వైయస్ జగన్ సిఎంగా మళ్లీ చేసుకునేందుకు శ్రమిస్తామంటున్న ఆవుటాల...
- ప్రస్తుతం వైసీపీ శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదవి...
- వైయస్ జగన్, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు...

**పుట్టపర్తి, డిసెంబర్ 14 :**
శ్రీ సత్యసాయి జిల్లా, పుట్టపర్తి కి చెందిన ఆవుటాల వెంకట రమణారెడ్డి రాజకీయాల్లో తమదైన శైలిలో రాణిస్తు పదవులను అలంకరిస్తున్నారు. వైయస్ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి పలు పదవులను అలంకరించిన ఆవుటాలకు వైసీపీ శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆవుటాల వెంకటరమణారెడ్డి 1977లో రాజకీయ రంగప్రవేశం చేసి పలు పదవులను అలంకరిస్తూ ద్వితీయ శ్రేణి నాయకుల్లో ప్రత్యేకశైలిని కనబరుస్తూ పార్టీ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రియతమ నాయకుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సిఎంగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామంటున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన ఆవుటాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదవిచ్చి పార్టీ అధిష్టానం మరింత బాధ్యతను పెంచిందంటున్నారు. తనకు ఈ పదవి దక్కేందుకు పూర్తి సహకారాన్నిచ్చిన పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి, పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆవుటాల కృతజ్ఞతలు తెలిపారు..అందరితో సఖ్యతగా (మిగతా 2లో)

# జిల్లా రాజకీయాల్లో రాణిస్తున్న ఆవుటాల



శాస్త్రవేత్తలతో కలసి పొలాల పరిశీలనలో...



అరటి పంటను పరిశీలిస్తూ..



విత్తన వేరుశనగను పరిశీలిస్తూ..



రైతన్నలకు ట్రాక్టర్లను అందజేస్తూ..

వుంటూ, తన నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా స్థాయి నాయకులందరినీ కలుపుకుని పార్టీ కార్యక్రమాల్లో ప్రధాన భూమిక పోషించి తనకు పదవినిచ్చిన నాయకులకు తన బాధ్యత నిర్వహణ తెలిసేలా వ్యవహరిస్తాననంటున్నారు ఆవుటాల వెంకటరమణారెడ్డి.

**ఆవుటాల కుటుంబ నేపధ్యం.....**

ఆవుటాల వెంకటరమణారెడ్డి బుక్కపట్నం మండలం, బుచ్చయ్యగారిపల్లికి చెందినవారు. ఈయన బిఏ పూర్తీ చేశారు. ఆయన తండ్రి ఆవుటాల రామక్రిష్ణారెడ్డి విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేశారు. తాత నారాయణరెడ్డి సింగిల్ విండో ప్రెసిడెంట్‌గా రాజకీయ రంగంలో ప్రవేశం వుంది. పూర్తీగా వ్యవసాయ ఆధారిత జీవనం. ఇద్దరు కుమారులు.. వారిలో పెద్దకుమారుడి కుటుంబం యు.యస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డారు. రెండవ కుమారుడు, కోడలు ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డారు. ప్రస్తుతం భార్యతో కలసి పుట్టపర్తిలో నివాసం వుంటున్నారు.

**రాజకీయ నేపధ్యం.....**

1977 లో రాజకీయ రంగప్రవేశం చేసిన ఆవుటాల వెంకటరమణారెడ్డి జనతాపార్టీ, కాంగ్రెస్ ఐ, 1983లో ఎన్టీరామారావు పైనున్న అభిమానంతో టీడీపీలో పనిచేసిన అనంతరం వైయస్ రాజశేఖర్‌రెడ్డిపై వున్న ప్రేమాభిమానాలతో కాంగ్రెస్ పార్టీలో, ఆయన అనంతరం వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీలో రాణిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో వున్నప్పుడు యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పని చేశారు. వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రారంభంలో నియోజకవర్గంలో ట్రేడ్ యూనియన్ జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. పార్టీ అధికారంలోకి వచ్చాక తన సొంత మండలమైన బుక్కపట్నం మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడిగా పనిచేశారు. 2022లో కొత్త జిల్లాలు ఏర్పడగానే శ్రీ సత్యసాయి జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులుగా పదవిని చేబట్టి జిల్లాలో రైతాంగం అభివృద్ధికి తనవంతుగా శ్రమించారు. ప్రస్తుతం వైసీపీ శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదవి చేజిక్కించుకున్నారు.

**జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతాయుతమైన పదవి**

ఆయన మాటల్లోనే....

వైసీపీలో జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ పదవి పూర్తీ బాధ్యతతో కూడుకున్న పదవి. తన నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలో పార్టీ అభివృద్ధికై నావంతు శ్రమిస్తాను. పార్టీ అధినాయకులు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, మా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. గతంలో జిల్లా వ్యవసాయ సలహా మండల అధ్యక్షుడిగా తనకు పదవి రావడంతో తమ ప్రియతమ నాయకుడు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సహకారం మరువలేనిది. ఆ సమయంలో పూర్తీ బాధ్యతగా తన విధులు కొనసాగించాను. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వ్యవసార రంగం అభివృద్ధికి, రైతన్నలకు ప్రభుత్వం నుంచి అందాల్సినవి సకాలంలో చేరేవిధంగా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి రైతన్నలకు సహాయ పడటంలో కీలక పాత్ర పోషించాను. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నాకు రైతన్నల స్థితిగతులపై పూర్తీ అవగాహన వుండటంతో చాలా సులువుగా ఆ పదవికి న్యాయం చేయగలిగాను. ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేబట్టడం ఆషామాషీ వ్యవహారం కాదు. పార్టీకి చెందిన జల్లా అధ్యక్షులతో పాటు అన్ని నియోజకవర్గాల సమన్వయ కర్తలతో సత్సంబంధాలు కలిగివుండి పార్టీ అధిష్టానం ఆదేశాలను తూచ తప్పకుండా పూర్తీ చేయాల్సిన బాధ్యత వుంది. ముఖ్యంగా ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో వున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు విసిగి వేజారుతున్నారు. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు. మళ్లీ వైయస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటుండటం గమనార్హం. కూటమి ప్రభుత్వం పూర్తీగా పాలనలో విఫలమైందని చెప్పుకోచ్చు. జిల్లా వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఇదే ఉత్సాహంతో వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునే వరకు విశ్రమించే ప్రసక్తేలేదు.



రైతు భరోసా ప్రారంభం కార్యక్రమంలో..



వైయస్ ఆర్ ఆసరా కార్యక్రమంలో..



వేరుశనగ పంపిణీ ప్రారంభోత్సవంలో...




మిల్లెట్స్ మీట్ కార్యక్రమంలో...

# బే షరతుగా షరతులు




(మొదటి పేజి (తరువాయి)

చేసుకుంటే కాపులుప్పాడలో 22.19 ఎకరాలు కేటాయించింది. ఇక్కడ శాశ్వత కార్యాలయం నిర్మాణానికి సీఎం చంద్రబాబు తాజాగా శంఖుస్థాపన చేశారు. ఈ క్యాంపస్ ను 8వేల మంది ఉద్యోగులు పనిచేసేలా అత్యాధునిక వసతులతో నిర్మించాల్సి ఉంది. 2033 నాటికి 3 దశల్లో రూ.1,583 కోట్ల పెట్టుబడితో కాగ్నిజెంట్ టెక్నాలజీస్ క్యాంపస్ నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. ఇందులో 2026 నాటికి మొదటి దశ నిర్మాణం పూర్తి చేసుకోనుంది. అయితే కాగ్నిజెంట్ తాజాగా భూమిపూజ సమయంలో ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి చేసింది. ఒప్పందం ప్రకారం తమ సంస్థ నిర్ణీత లక్ష్యాలను (క్యాంపస్ నిర్మాణం, ఉద్యోగాల కల్పన) గడువు లోపు అందుకోలేకపోతే ఏకపక్షంగా ఎంఓయూ రద్దు చేయకూడదని కోరింది. గడువులోపు నిర్మాణం పూర్తి కాక, ఉద్యోగాలు కల్పించలేకపోయినా అందుకు దారితీసిన పరిస్థితులు, కారణాలు తెలుసుకుని తుది నిర్ణయం తీసుకోవాలని, అలాగే ఏదైనా అంశంలో ప్రభుత్వానికీ, తమకూ ఏకాభిప్రాయం కుదరకపోతే మధ్యవర్తిత్వానికి వెళ్లేందుకు అనుమతి ఉండాలంటూ కోరింది. దీంతో ప్రభుత్వం కూడా చేసేది లేక అందుకు సమ్మతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రానికి వస్తున్న సంస్థల డిమాండ్లను తెరపైకి తెచ్చింది.

# మరో అంతర్జాతీయ విమానశ్రయం



**బెంగుళూరు, డిసెంబర్ 14 :**

బెంగళూరులో రెండో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు దిశగా ముందడుగు పడింది. కర్ణాటక పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ టెండర్‌ను ఆహ్వానించింది. అదే సమయంలో నగర శివార్లలో మూడు ప్రదేశాలు షార్ట్ లిస్ట్ అయ్యాయి. దీనికి సంబంధించిన డీపీఆర్ ను సిద్ధం చేయడానికి కర్ణాటక ప్రభుత్వం కన్సల్టెంట్‌ను సైతం నియమించనుంది. ఎయిర్ పోర్ట్ అథారిటీ చేపట్టిన ప్రాథమిక అంచనా తర్వాత కేఎస్ఐడీసీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి పెరుగుతున్న తాకిడిని దృష్టిలో ఉంచుకుని రెండో ఎయిర్ పోర్ట్ ను నిర్మించాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి మూడు స్థలాలు ఎంపిక అయ్యాయి. ప్రస్తుతం పరిశీలనలో ఉన్న మూడు స్థానాల్లో బెంగళూరు- కనకపుర రోడ్డు సమీపంలో గల చూడాహళ్లి, సోమనహళ్లితో పాటు నేలమంగళ- కుణిగళ్ మధ్య స్థలాన్ని షార్ట్ లిస్ట్ చేసింది ఏఏఐ. ప్రతిపాదిత విమానాశ్రయం కోసం సుమారు 4,500 ఎకరాల అవసరమౌతాయని, ప్రస్తుతం ఎంపిక చేసిన మూడు చోట్ల కూడా ఖాళీ స్థలం ఉన్నట్లు ఏఏఐ అధికారికంగా కర్ణాటక ప్రభుత్వానికి తెలియజేసింది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చూడాహళ్లి, సోమనహళ్లి వైపు మొగ్గు చూపినట్లు చెబుతున్నారు. దీనికి కారణం లేకపోలేదు. కనకపుర.. ఆయన సొంత అసెంబ్లీ నియోజకవర్గం. హెూమ్ మంత్రి జీ పరమేశ్వర నేలమంగళ- కుణిగల్ వైపు ఈ ఎయిర్ పోర్ట్ నిర్మిస్తే బాగుంటుందని చెబుతున్నారు. దీనికి సమాంతరంగా పొరుగున ఉన్న తమిళనాడు కూడా కొత్త ఎయిర్ పోర్ట్ కు ప్రణాళికలను రూపొందించింది. బెంగళూరుకు అతి సమీపంలో ఉన్న హెూసూర్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణాన్ని వేగవంతం చేస్తోంది. ఏటా 30 మిలియన్ల మంది ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రణాళికలను తయారు చేసింది. బెంగళూరులో విమాన ప్రయాణీకులు, కార్గో రవాణా డిమాండ్ నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో కెంపేగౌడ ఎయిర్ పోర్ట్ కు అనుబంధంగా ఈ రెండో విమానాశ్రయం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే 35 సంవత్సరాల కాలానికి ప్రయాణీకులు, కార్గో ట్రాఫిక్‌ను అవసరాలకు అనుగుణంగా డీపీఆర్ సిద్ధం కానుంది. వీటితో పాటు ప్రతిపాదిత విమానాశ్రయం అభివృద్ధి, నిర్వహణ ఖర్చులతో సహా ఆర్థికపరమైన సాధ్యాసాధ్యాలను కూడా అధ్యయనం చేస్తారు.

# వృక్షో రక్షతి రక్షిత:



(మొదటి పేజి (తరువాయి)

ప్రాముఖ్యమైన ధ్వజస్తంభాల నిర్మాణానికి అవసరమైన దివ్య వృక్షాలను టీటీడీ స్వయంగా పెంచుతుంది. వాటిని పరిరక్షిస్తుంది. ధ్వజస్తంభాలు అవసరమైన ఆలయాలకు వాటిని వినియోగిస్తుంది. ఈ వివరాలను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ధ్వజస్తంభం కేవలం నిర్మాణాత్మక అంశం మాత్రమే కాదని, భక్తి, పవిత్రత, దైవ సన్నిధిని ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. ఆగమశాస్త్రాల ప్రకారం ధ్వజస్తంభం నిలువుగా పెరిగిన ఒకే చెట్టుకు చెందిన పవిత్ర వృక్ష కాండంతో తయారు చేయాలి. ఆ వృక్షాన్ని ఆధ్యాత్మిక, జ్యోతిష్య, విధి విధానాలకు అనుగుణంగా ఎంపిక చేసి, సంవత్సరాల తరబడి సంరక్షించి, ఆపై శాస్త్రోక్తంగా కైంకర్యాలు నిర్వహించిన అనంతరం వినియోగిస్తారు. ఆగమ సంప్రదాయాల ప్రకారం ధ్వజస్తంభాల తయారీలో సాధారణంగా టేకు, ఏగిశా/ ఇండియన్ కినో, టెర్మినేలియా, షోరియా జాతికి చెందిన వృక్షాలను వినియోగిస్తారు. ఇవి బలంగా, దీర్ఘకాలికంగా నిలువుగా పెరిగే స్వభావం కలిగి ఉండటం వల్ల ధ్వజస్తంభం అవసరాలకు అనుకూలంగా ఉంటాయి. పరిపక్వత చెందిన తర్వాత ఆ వృక్షాన్ని శాస్త్రోక్తంగా పూజించి, ఆపై ధ్వజస్తంభంగా రూపకల్పన చేస్తారు. అనంతరం దానిని కవచంతో కప్పి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం వంటి అత్యంత పవిత్ర ఆలయాల్లో అలంకరిస్తారు. రాజగోపురం, గర్భగుడి విమానం మధ్య పవిత్ర ప్రదేశంలో ప్రతిష్ఠించే ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఆవిష్కరిస్తారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని ప్రకటించే ఈ ధ్వజారోహణం సమస్త లోకాలోన్ని దేవతలను ఆహ్వానించే శుభ సూచకంగా నిలుస్తుంది. దేశవ్యాప్తంగా 60కి పైగా ఆలయాలను నిర్వహిస్తున్న టీటీడీ, భవిష్యత్తులో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాలను ఆగమ నియమాలకు అనుగుణంగా నిర్మించే బాధ్యతను దృష్టిలో ఉంచుకుని, ఈ దివ్య వృక్షాల ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో భాగంగా సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో దివ్య వృక్షాల ప్రాజెక్టు కోసం కేటాయించాలని టీటీడీ బోర్డు ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు అమలుతో, ధ్వజస్తంభాల కోసం అవసరమైన దివ్య వృక్షాలను స్వయంగా పెంచే తొలి దేవాలయ సంస్థగా టీటీడీ దేశంలో చరిత్ర సృష్టించనుంది. దీని ద్వారా ఆగమ శుద్ధి, ఆధ్యాత్మిక పవిత్రత, పర్యావరణ బాధ్యత, సంస్థాగత స్వావలంబనను తరతరాలకు కొనసాగించగలుగుతామని టీటీడీ స్పష్టం చేసింది.

# టిడిపిలో రచ్చో ..రచ్చ

(మొదటి పేజి (తరువాయి)

సాగుతుండగా.. మధ్యలో అధిష్టానం పలుమార్లు జోక్యం చేసుకుని శాంతింపజేసింది. అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో మార్పు రాకపోగా మరింత ముదురుతున్నాయి. ఇదే క్రమంలో తాజాగా తిరువూరులో సంచలన పరిణామాలు చోటు చేసుకున్నాయి. తిరువూరు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న కొలికపూడి శ్రీనివాస్ ను టార్గెట్ చేస్తూ స్థానికంగా ఉన్న కేశినేని చిన్ని వర్గీయులు చేస్తున్న రచ్చతో మరోసారి ఆయన వారిపై ఫైర్ అవుతున్నారు. దీంతో వారు కూడా పోటాపోటీగా ఆయనతో సై అంటే సై అంటున్నారు. దీంతో కొలికపూడి రాసలీలలు అంటూ తాజాగా పలువురు తిరువూరు నేతలు తమ వాట్సాప్ స్టేటస్ లలో కొన్ని వీడియోలు, ఫొటోలు పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో కొలికపూడి కూడా కేశినేని మద్దతుదారుల్ని టార్గెట్ చేస్తూ వారి రహస్య ఫొటోల్ని బయటపెట్టారు. దీంతో ప్రస్తుతం తిరువూరు ఎమ్మెల్యే వర్సెస్ నాలుగు మండలాల ముఖ్య నాయకులు అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. తాజాగా ఎమ్మెల్యే కొలికపూడి వాట్సాప్ స్టేటస్ లో విస్సన్ పేట మండల నాయకుల్ని టార్గెట్ చేస్తూ కొన్ని ఫొటోలు పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో స్థానిక నాయకుడు సుబ్బారావు ఎమ్మెల్యే రాసలీలలు అంటూ టీడీపీ గ్రూపులో ఫొటోలు



పెట్టినట్లు సమాచారం. దానికి కౌంటర్ గా సాక్షాత్తు ఎమ్మెల్యే.. టీడీపీ ముఖ్య నాయకుల రాసలీల ఫోటోలు వాట్సప్ స్టేటస్ లో పెట్టడం చర్చకు దారితీసింది. దీంతో ఈ వార్ కు ఎండ్ ఎప్పుడన్న చర్చ ఇప్పుడు నియోజకవర్గంలో జరుగుతోంది. గతంలో ఓసారి కేశినేని చిన్ని, కొలికపూడి వర్గాల్ని పిలిపించి మాట్లాడిన టీడీపీ అధిష్టానం మరోసారి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని హెచ్చరికలు చేసింది. అయినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. అయితే ఈసారి మాత్రం కేశినేని చిన్ని ఎక్కడా బయటపడకుండా తన మద్దతుదారులతో కొలికపూడిపై వార్ చేయిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. దీనిపై కొలికపూడి బహిరంగ ఆరోపణలే చేస్తున్నారు. దీంతో ఈసారి టీడీపీ అధిష్టానం ఏం చేయబోతోందన్న ఉత్కంఠ మొదలైంది.

# బంగారు నిక్షేపాలు

(మొదటి పేజి (తరువాయి)

ప్రాంతం నుండి 6000 టన్నుల బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతిరోజు వెయ్యి టన్నుల ఖనిజాన్ని శుద్ధి చేస్తున్నారు ఇక్కడ దాదాపు కోటి టన్నుల ఖనిజ నిల్వలు ఉన్నట్టుగా అంచనా వేస్తున్నారు. వేగంగా జరుగుతున్న బంగారం తవ్వకం పనులు ఈస్ట్ బ్లాక్ లో 180 మీటర్ల లోతులో 6.8 టన్నుల పసిడి ఉన్నట్టు గుర్తించారు. జియో మైసూర్ సంస్థ ఏడాదికి నాలుగు లక్షల టన్నుల ఖనిజాన్ని వెలికి తీసి 3లక్షల టన్నులను శుద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. అధునాతన యంత్రాలతో ఈ పనిని మరింత వేగవంతం చేస్తూ బంగారం తవ్వకాన్ని చేపట్టారు. బంగారు ఖనిజం వెలికితీస్తే బంగారం ధరలు తగ్గే ఛాన్స్ దేశంలో ఉన్న బంగారు ఖనిజ నిక్షేపాలను తవ్వి బంగారు ఖనిజాన్ని వెలికితీస్తే మనదేశంలో బంగారాన్ని ఎక్కువగా దిగుమతి చేసుకోవలసిన అవసరం ఉండదు. అప్పుడు బంగారం ధరలు కాస్త తగ్గే అవకాశం ఉంటుందన్న భావన చాలామందిలో వ్యక్తమవుతుంది.

# మరిన్ని సుంకాల మోత

**న్యూఢిల్లీ, డిసెంబర్ 14 :**

అంతర్జాతీయంగా మారుతున్న పరిణామాలు భారత్ కు సంకటంగా పరిణమిస్తున్నాయి. ఈ ఏడాది భారతీయ ఉత్పత్తులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించింది. ఇందులో 25 శాతం సుంకాలు సాధారణమైనవి కాగా.. మరో 25 శాతం రష్యా చమురు కొనుగోలు చేస్తున్నామన్న కోపంతో ట్రంప్ విధించినవి ఉన్నాయి. ఇప్పుడు ఇదే బాటలో అమెరికా పొరుగుదేశం కూడా భారత్ పై ఇలాగే 50 శాతం సుంకాలు విధించి షాక్ ఇచ్చింది. కొన్ని భారతీయ ఉత్పత్తులపై సుంకాల్ని 50 శాతానికి పెంచుతూ మెక్సికో సంచలన నిర్ణయం తీసుకుంది. ఆటో విడిభాగాలు, తేలికపాటి కార్లు, దుస్తులు, ప్లాస్టిక్, ఉక్కు, గృహెూపకరణాలు, బొమ్మలు, వస్త్రాలు, ఫర్నిచర్, పాదరక్షలు, తోలు వస్తువులు, కాగితం, కార్డ్‌బోర్డ్, మోటార్‌సైకిళ్లు, అల్యూమినియం, ట్రైలర్‌లు, గాజు, సబ్బులు, సుగంధ ద్రవ్యాలు, సౌందర్య సాధనాలు వంటి వస్తువులపై మెక్సికో సుంకాలు విధించింది. స్థానిక పరిశ్రమ, ఉత్పత్తిదారులను రక్షించడానికి మెక్సికో విధించిన ఈ సుంకాలు 2026 జనవరి 1 నుండి అమలులోకి వస్తాయి. ఈ నిర్ణయం దాదాపు 1 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు కొత్త సుంకాల ప్రభావం భారతదేశంతో పాటు, దక్షిణ కొరియా, చైనా, థాయ్‌లాండ్, ఇండోనేషియా వంటి మెక్సికోతో వాణిజ్య ఒప్పందాలు లేని దేశాలపై పడనుంది. ఈ సుంకాల నుంచి భారతీయ కంపెనీలను రక్షించడానికి భారత్, మెక్సికో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాయి. మెక్సికో తాజా నిర్ణయంపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. భారతీయ ఎగుమతిదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి తగిన చర్యలు తీసుకునే హక్కు భారతదేశానికి ఉందని, నిర్మాణాత్మక చర్చల ద్వారా పరిష్కారం కోసం కృషి చేస్తామని వాణిజ్య వ్యవహారాలశాఖ తెలిపింది. ఈ బిల్లును మొదట ప్రవేశపెట్టిన సమయంలోనే మెక్సికోతో భారత్ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అయినా మెక్సికో వెనక్కి తగ్గలేదు. ప్రస్తుతం ప్రపంచ వాణిజ్య నిబంధనలకు అనుగుణంగా పరస్పర ప్రయోజనకరమైన పరిష్కారాలను అన్వేషించడానికి భారత వాణిజ్య శాఖ.. మెక్సికో ఆర్థిక మంత్రిత్వ శాఖతో చర్చలు జరుపుతోంది. ఈ విషయంపై ఇప్పటికే వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్, మెక్సికో ఉప-ఆర్థిక మంత్రి లూయిస్ రోసెండో మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. త్వరలో మరిన్ని చర్చలు ఉంటాయని తెలుస్తోంది.

# అసభ్యకర వీడియోలు

## ప్రేమ పేరుతో మోసం..

## తల్లి ఆత్మహత్యా యత్నం



**గుంటూరు, డిసెంబర్ 14 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఏపీలోని గుంటూరు నగరంలో ఒక ఇంటర్ విద్యార్థినిని డ్రగ్స్ కు బానిసను చేసి ఆమెతో అసభ్యకర వీడియోలు, ఫోటోలు చిత్రీకరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇక ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో, బాలిక అసభ్యకర ఫోటోలు, వీడియోలు చూసిన తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన వివరాలలోకి వెళితేగుంటూరు నగరంలో 17 సంవత్సరాల వయసున్న ఒక ఇంటర్ విద్యార్థిని డ్రగ్స్ బారిన పడింది. అదే కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థితో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పరచుకున్న బాలిక ప్రేమ పేరుతో అతనికి దగ్గరయింది. దీంతో అతను బాలికకు డ్రగ్స్ అలవాటు చేశాడు. తన గదికి రప్పించి మత్తు పదార్థాలు ఇచ్చి ఆపై ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా తన స్నేహితుడితో ఆ దృశ్యాలను వీడియోలు ఫోటోలు ద్వారా రికార్డు చేయించాడు. కూతురి వీడియోలు చూసి తల్లి ఆత్మహత్యా యత్నం రెండు రోజుల క్రితం బాలిక ఫోన్ పరిశీలించిన తల్లికి అందులో యువకుడితో సన్నిహితంగా ఉన్న అభ్యంతరకరమైన ఫోటోలు కనిపించాయి. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన తల్లిదండ్రులు బాలికను ప్రశ్నించారు. బాలిక వారికి సమాధానం చెప్పకపోగా తిరిగి వారి పైన దాడికి పాల్పడింది. దీంతో నిద్ర మాత్రలు మింగి తల్లి ఆత్మహత్యకు ప్రయత్నం చేసింది. ఆపై తల్లిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నారు. కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందం అయితే ఈ విషయం తెలుసుకున్న ఈగల్ విభాగ ఐజి ఆర్కే రవి కృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుళ్ జిందాల్ జిజిహెచ్ కు వెళ్లి బాలిక తల్లిని పరామర్శించారు. ఈ కేసు పైన సమగ్ర దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని బాలిక తల్లికి హామీ ఇచ్చారు ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందంతో ఈ కేసులో విచారణ ప్రారంభించారు. బాలికకు డ్రగ్స్ అలవాటు చేసిన వ్యక్తి విద్యార్థి సంఘం నాయకుడు అయితే బాలికకు డ్రగ్స్ అలవాటు చేసిన యువకుడు ఒక రాజకీయ పార్టీకి చెందిన విద్యార్థి సంఘ నాయకుడని ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. బాలిక ప్రవర్తన తెలిసిన తల్లిదండ్రులు వేరే యువకుడితో వివాహం చేయాలని నిశ్చయించగా, అది ఇష్టం లేక మీ కుటుంబంతో గొడవ పడుతుందని పోలీసులు చెప్తున్నారు. తల్లి ఆత్మహత్యా యత్నంతో బయటకు వచ్చిన ఘటన మొత్తంగా ఫోన్లో కూతురు అసభ్యకరమైన ఫోటోలు, వీడియోలు చూసిన తల్లి ఆత్మహత్యాయత్నం చేయగా ఈ వ్యవహారం బయటకు వచ్చింది. మైనర్ బాలికతో ఈ విధమైన చర్యలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



మెట్టు గోవిందరెడ్డిని సన్మానిస్తున్న సోషల్ మీడియా కన్వీనర్ కొత్తపల్లి శివయ్య

## మెట్టు గోవిందరెడ్డికి సన్మానం

**మండల సోషల్ మీడియా కన్వీనర్ కొత్తపల్లి శివయ్య**

**కనేకల్, డిసెంబర్ 14:**
రాయదుర్గం వైయస్సార్ సిపి కాంగ్రెస్ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని కనేకల్ సోషల్ మీడియా కన్వీనర్ కొత్తపల్లి శివయ్య ఆదివారం రాయదుర్గంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శివయ్య మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి మీడియా కన్వీనర్గా తనను ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. తనపై పార్టీ ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అందించిందన్నారు. ఈ బాధ్యతను సక్రమంగా నెరవేర్చి పార్టీకి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సోషల్ మీడియా కన్వీనర్గా ఎంపిక చేసిన మెట్టు గోవిందరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మెట్టు గోవిందరెడ్డి సూచించారు.



మండల టిడిపి క్లస్టర్ ఇంచార్జ్, ఉప్పర సాగర సంగం చైర్మన్ ఆనంద్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు

## ఘనంగా ఉప్పర సాగర సంఘం చైర్మన్ ఆనంద్‌రాజ్ జన్మదిన వేడుకలు

**కనేకల్ డిసెంబర్ 14 :**
మండల టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్, రాష్ట్ర ఉప్పర సగర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్ రాజ్ జన్మదిన వేడుకలు టిడిపి నాయకులు తారక రామ్‌నగర్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఆనంద్ రాజుగారు టిడిపి పార్టీలో అచలంచలుగా ఎదుగుతూ ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు చేపడుతు ప్రజలతో మమేకమై పార్టీకి అన్ని సందర్భాల్లో అండదండలుగా నిలిచారన్నారు. మరిన్ని అద్భుతమైన పదవులు రాబోయే కాలంలో చేపట్టి మంచి నాయకుడిగా ఎదగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టిడిపి మండల కన్వీనర్ లాలెప్ప, చెరువు సంఘం అధ్యక్షుడు బిటి రమేష్, మాజీ ఎంపీపీ మాబు సాబ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్ భాష,నాగప్ప, వన్నూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఉపాధ్యాయుల డివిజనల్ క్రికెట్ పోటీలు

**రాయదుర్గం జట్టు విజయం..**
**నేడు సెమీ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లు..**


**బెళుగుప్ప, డిసెంబర్ 14:**
బెళుగుప్ప మండలం పరిధిలోని యర్రగుడి గ్రామంలో జరుగుతున్న కళ్యాణదుర్గం డివిజనల్ స్థాయి ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. రెండవ రోజు ఆదివారం యర్రగుడి క్రీడామైదానం నందు బెళుగుప్ప మండలం వర్సెస్ రాయదుర్గం మండలాల మధ్య జరిగిన పోటీలో ముందుగా బ్యాటింగ్ చేపట్టిన రాయదుర్గం మండలం జట్టు నిర్ణీత 15 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 153 పరుగులు సాధించింది. రాయదుర్గం జ ట్టులో సునీల్ పిడి అత్యధికంగా 59 పరుగులు సాధించి తమ జట్టు భారీ స్కోరు సాధించడానికి దోహదపడ్డాడు. ఆ తర్వాత బ్యాటింగ్ చేపట్టిన బెళుగుప్ప మండలం జట్టు 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 89 పరుగులు సాధించి ఓటమి చెందింది. నేడు రాయదుర్గం మండలం కనేకల్ మండలాల మధ్య మొదటి సెమీఫైనల్ మ్యాచ్, బ్రహ్మసముద్రం మండలం, కుందుర్పి మండలాల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ మధ్యాహ్నం యర్రగుడి క్రీడా మైదానం నందు జరుగుతాయని కళ్యాణదుర్గం డివిజనల్ కోఆర్డినేటర్ గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకరన్న , పిడి లు కోటప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



రామసాగరం గ్రామంలోని వ్యవసాయ తోటల్లో అమర్చిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లలోని రాగి వైరు ఆయిల్ చోరీ చేసిన దృశ్యం

## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లలో రాగి వైరు చోరీ

**బెళుగుప్ప, డిసెంబర్ 14:**
బెళుగుప్ప మండలం పరిధిలోని రామసాగరం గ్రామంలో శనివారం రాత్రి ముగ్గురు మంది రైతుల వ్యవసాయ తోటలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లలో ఉన్న రాగి వైరు ను గుర్తుతెలియనీ వ్యక్తులు చోరీ చేశారు. రామసాగరం గ్రామానికి చెందిన రైతులు ఓబులేసు చౌదరి, వెంకటస్వామి, ఎర్రిస్వామి వ్యవసాయ తోటల్లో అమర్చిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లలో ఉన్న రాగి వైరు, ఆయిల్ ను గుత్తి తెలియని వ్యక్తులు దోచుకుని వెళ్లారు. రైతుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రామదాసు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు..



రామసాగరం గ్రామంలోని వ్యవసాయ తోటల్లో అమర్చిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లలోని రాగి వైరు ఆయిల్ చోరీ చేసిన దృశ్యం

## గుత్తి కోటను అధిరోహించిన జిల్లా కలెక్టర్ ఆనంద్

**గుత్తి, డిసెంబర్ 14:**
జాతీయ రహదారులు 44, 67 నుండి గుత్తి కోటకు రోడ్డు మార్గాన్ని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదివారం పరిశీలించారు. పర్యటనలో భాగంగా గుత్తికి విచ్చేసిన ఆయన కోటలోని ప్రముఖ చారిత్రక కట్టడాలను ఆయన పరిశీలించడంతోపాటు గుర్రపుశాలకు దగ్గరగా కనెక్టివిటీని పరిశీలించారు. హైదరాబాద్ బెంగళూరు, చెన్నై, హంపి తదితర పట్టణాల నుండి గుత్తి కోటకు ఆనుకొని ఉన్న జాతీయ రహదారుల గుండా ప్రతి నిత్యం కొన్ని వేల వాహనాలు వెళ్తుంటాయి. వాహనాల్లో వెళ్లే వారికి ఒక



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆనంద్ తదితరులు



గుత్తి కోటను అధిరోహిస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్ తదితరులు

గంట సేపు సేద తీర్చుకోవడానికి అలాగే గుత్తి కోట లోని పర్యటక ప్రదేశాలను చూసి ఆనందించడానికి , జాతీయ రహదారులకు దగ్గరగా ఉన్న అనువైన ప్రదేశాలను, కోటకు దగ్గర గా ఉండే రహదారిని ఆయన పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో గుత్తి తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్, కొత్తపేట గ్రామ సర్పంచ్ మస్తాన్, మండల సర్వేయర్, రెవిన్యూ సిబ్బంది, మునిసిపల్ సర్వేయర్ మునిసిపల్ సిబ్బంది, సమితి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ క్యాంపు

**గుత్తి, డిసెంబర్ 14:**
గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గుత్తి అనంతపురం గ్రామంలో ఈనెల 8 వ తేదీ నుండి 14 వ తేదీ వరకు నిర్వహించిన 7 రోజుల ప్రత్యేక శిబిరం విజయవంతంగా ముగిసింది. శిబిరం ప్రారంభ రోజున బడి మానేసిన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు . స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామ వీధులు, పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రమాణం చేశారు. నీటి సంరక్షణ, వర్షపు నీటి సేకరణ పై అవగాహన, వర్షపు నీటిని నిల్వ చేయడంపై ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు. పచ్చదనం పెంచేందుకు వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు, గ్రామ ప్రజలతో కలిసి మొక్కలను





గుత్తి అనంతపురం గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల క్యాంపు



గుత్తి అనంతపురం గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల క్యాంపు

నాటారు.యువత ఆరోగ్యవంతంగా ఉండేందుకు యోగా, ధ్యానం, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక సెషన్లు నిర్వహించి పాల్గొన్న వారికి ప్రాయోజికవ్యాయామాలు చూపించారు.డిజిటల్ ఇండియా లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయడానికి డిజిటల్ సాక్షరత, ఆన్‌లైన్ సేవల వినియోగంపై అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారు. చివరి రోజు వాలెడిక్టరీ కార్యక్రమంలో శిబిరపు కార్యకలాపాలపై నివేదికను సమర్పించి, శ్రేష్ఠంగా సేవలందించిన వాలంటీర్లను సన్మానించారు. గ్రామస్తులు మరియు గేట్స్ కళాశాల యాజమాన్యం ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవా భావాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో ఇలా మరిన్ని శిబిరాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మురళీధర్ రెడ్డి, ఎం ఈ ఓ రాయుడు, హెడ్ మాస్టర్ చిదంబర రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ రాజేష్ పాల్గొన్నారు

## అధికారుల తీరు మారదు.. కార్మికుల అవస్థలు తీరవు..

### యాడికి మేజర్ పంచాయతీ తీరు..

**యాడికి, డిసెంబరు14 :**
యాడికి మేజర్ పంచాయతీ అధికారుల తీరు మారకపోవడంతో ఇక్కడి పంచాయతీ పారిశుధ్ధ్య కార్మికుల అవస్థలు తీరడం లేదు. అపరిశుభ్రత పరిస్థితుల్లో సరైన శుభ్రతా పరికరాలు లేకపోయినా ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి చెత్తశుద్ధి చేపడుతున్న కార్మికుల పట్ల అధికారులు చిత్తశుద్ధి చూపడం లేదనే విమర్శలువెల్లువెత్తుతున్నాయి. ఏ నెలకు ఆ నెల వేతనాలు చెల్లిస్తేనే పూట గడవడం కష్టంగా మారిన తమ పేద కుటుం బాలకు మూడు, నాలుగు నెలలకు ఒకసారి వేతనాలు చెల్లిస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయం నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలకు ఒకసారి కూడా పంచాయతీ అధికారుల చుట్టూ తిరిగి ప్రాధే యపడ తేగాని వేతనాలు చెల్లించడం లేదని, అప్పుడు కూడా ఒక నెల వేతనాలు చెల్లించి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారిందని కార్మికులు కన్నీటి పర్యంతమవుతున్నారు. గ్రేడ్-2 పంచాయతీల్లోనే ప్రతి కార్మికునికి రూ. 13,500 లు, మేజర్ పంచాయతీల్లో రూ.14,500 లు ఇస్తుంటే యాడికి మేజర్ పంచాయతీ అయినప్పటికీ ప్రతి కార్మికునికి కేవలం నెలకు రూ.10,500 లు ఇస్తున్నారని, అది కూడా నెలనెల సక్రమంగా ఇవ్వడం లేదని ఇక్కడి కార్మికులు వాపోతున్నారు. 34 మంది కార్మికులకు నెల నెలా చెల్లించాల్సిన రూ.3.57 లక్షలు కూడా



యాడికి మేజర్ పంచాయతీ కార్యాలయం.




పంచాయితీ సిబ్బంది

నాలుగు నెలలకు ఒకసారి ఒక నెలది మాత్రమే చెల్లిస్తూ కార్మికులను కష్టాల్లోకి నెడుతున్న అధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రతి నెలా కార్మికులకు సకాలంలో వేతనాలు
చెల్లించాల్సిందేనని ఉన్న తాధికారులు సూచిస్తున్నా క్షేత్రస్థాయి అధికారులు పెడచెవిన పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయితీకి రావాల్సిన ఇంటి పన్నులు, కొళాయి సొమ్ము , ఆర్థిక నిధులు అడ్డదారి పడుతున్న పట్టించుకోని అధికారులు కార్మికుల వేతనాల విషయం కూడా గాలికి వదిలేయడంతో యాడికి పంచాయతీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా మారిందని స్థానికులు తీవ్రంగా విమర్శి స్తున్నారు. ఏదో ఒకరోజు పంచాయతీ కార్యాలయానికి తాళం వేసేరోజు దగ్గరలో ఉందని పంచాయతీ నిర్వహణ తీరు ను తదేకంగా పరిశీలి స్తున్న కొందరు చైతన్యవం తులు, స్థానికులు చర్చించుకో వడం సర్వత్రా కనిపిస్తోంది. పంచా యతీ సిబ్బంది, కార్మికుల దయనీ య పరిస్థితిపై ఉన్న తాధికా రులైనా స్పందిం చకపోతే పారిశుధ్య పనులు కూడా ముందుక సాగడం కష్టంగా మారనుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కార్మిక సంఘాల నాయకులు కూడా మౌనం పాటించడం పట్ల వలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటిపై ఇంచార్జ్ ఈవో శశికళ వివరిస్తూ యాడికి మేజర్ పంచాయతీలో 34 మంది సిబ్బందికి మూడు నెలల వేతనాలు బిల్లులు పెట్టినరు ఈనెల 20 లోగా వారి వారి అకౌంట్లో డబ్బులు పడతాయని ఇంచార్జ్ ఈవో శశికళ తెలిపారు.

## తగ్గుపర్తిలో ఉచిత వైద్య శిబిరం

**బెళుగుప్ప, డిసెంబర్ 14:**
బెళుగుప్ప మండలం పరిధిలోని తగ్గుపర్తి గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచ్ కోనంకి మౌనిక ఆధ్వర్యంలో అనంతపురం మ్యాగ్నస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య చికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా వేలాది రూపాయల ఖర్చు పెట్టుకోలేక ఇబ్బందులకు గురవుతున్న గ్రామీణు లకు ఉచిత వైద్య శిబిరాలు మంచి అవకాశం అని కార్డియాలజీ నిపుణులు డాక్టర్ రిషి



తగ్గుపర్తి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న మ్యాగ్నస్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు



తగ్గుపర్తి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న మ్యాగ్నస్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు


ప్రసాద్ పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అనంతపురంలోని తమ ఆసుపత్రిలో వైద్యం చేయడం జరుగుతుందన్నారు. ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ రితిన్ చౌదరి, ఫిజీషియన్ డాక్టర్ లఖిత ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు దబ్బర వెంకటనాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు రాధాకృష్ణ, మొరుసు జయప్ప, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అగాపే ఆశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

## అగాపే ఆశ్రమంలో అన్నదానం

**యాడికి, డిసెంబర్ 14 :**
యాడికి మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో ఆదివారం కీ"శే" తంగసాని విజయభాస్కర్ రెడ్డి 14వ వర్ధంతి ని జ్ఞాపకం చేసుకుంటూ ఆయన భార్య తంగసాని లక్ష్మీదేవి, కొడుకు మహర్షి రెడ్డి , కోడలు, కూతురు మౌనిక రెడ్డి వీరి కుటుంబము ఆశ్రమంలోని నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయించి అన్నదానం చేశారు. ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా వారి కుటుంబానికి అభినందనలు తెలిపారు.



మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

యాడికి, డిసెంబర్ 14 :
యాడికి పాత పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం అమీనా కంటి ఆసుపత్రి నందు ఆదివారం ఉదయం 10 నుండి 1 గంట వరకు నంద్యాల శాంతిరాం మెడికల్ కాలేజ్ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో వివిధ గ్రామాల నుండి 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో18 మందికి ఆపరేషన్ కొరకు నంద్యాలకు తీసుకుని వెళ్లారు.

## ముస్లింలు బాగా చదివి ఉన్నత పదవుల్లో ఉండాలి

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 14 :**
ప్రస్తుత సమాజంలో ముస్లింలు ఉన్నత చదువుల చదివి ఉన్నత పదవులు పొందాలని మధ్యప్రదేశ్ పాటన్ జబల్పూర్‌కు చెందిన అబ్దుల్ ఖాదీర్ అన్నారు. తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారుక్ వారి సున్ని కాన్ఫరెన్స్ ఆదివారం సాయంత్రం 4 గంటలకు అనంతపురం నగరం రెండవ రోడ్డులోని బహవుద్దీన్ మస్జీద్ ఆవరణలో నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కర్ణాటక హుక్కెరికి చెందిన హజరత్ ఆన్ జార్ ఖాన్ ప్రసంగిస్తూ ప్రస్తుత సమాజంలో భార్యాభర్తల మధ్య సఖ్యత కరువై విడాకులు తీసుకుంటున్నారని అన్నారు. ఇద్దరు ప్రేమనురాగాలతో ఉండాలన్నారు. బెంగళూరుకు చెందిన డాక్టర్ తౌసిఫ్ రజా ప్రసంగిస్తూ ప్రస్తుత సమాజంలో ఓర్పు కరవయిందన్నారు. ప్రతి ఒక్క మానవుడు ఓర్పు కలిపి ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. తెహరీక్ అధ్యక్షులు హసన్ రజా ప్రసంగిస్తూ ప్రస్తుత సమాజంలో స్త్రీలు ఏ విధంగా నడుచుకోవాలో వివరించారు. మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి, సాహాబాల పవిత్ర కేశాలు, వాడిన వస్తువులు, ధరించిన దుస్తులను ప్రజల సంద్శనార్థం ఉంచారు. ఈ కార్యాక్రమంలో బహవుద్దీన్ మస్జీద్ ముతవల్లి ఫరీదుద్దీన్, సెక్రటరీ పర్వేష్, ట్రెజరర్ షబ్బీర్ అహమ్మద్, హాబీబ్, హుస్సేన్, అబ్దుల్ సమీ, కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థినికి ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

## విద్యార్థిని చదువుకి నిత్యసురభి సాయం

అనంతపురం రూరల్, డిసెంబర్ 14:
నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమ ఆధ్వర్యంలో చైర్పర్సన్ శ్రీమతి. డాక్టర్ .ఎస్. నిర్మలమురళి బీటెక్ చదువుతున్న విద్యార్థినికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ట్రస్టు సభ్యులు శ్రీమతి కుసుమ నాన్నగారు మద్దిలేటి వర్ధంతి సందర్భంగా బీటెక్ చదువుతున్న విద్యార్థినికి సాకారం అందించారు. బీటెక్ చదువుతున్న విద్యార్థిని చదువులో బాగా రాణిస్తోంది.. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మానేయాలని నిర్ణయించుకుంది. ఈ విషయం నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ చైర్పర్సన్ నిర్మలమురళికి విషయం తెలియడంతో ట్రస్ట్, ఏయిం ఫర్ సేవా శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమం నిర్వాహకులు చక్రపాణి సంయుక్తంగా ఆదివారం పుట్టినిల్లు ఆశ్రమంలో విద్యార్థినికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకూడదన్నారు. కుటుంబం ఎంత పేదరికంలో ఉన్న, వారిని ఆర్థికంగానూ, గౌరవంగాను నిలబెట్టేది చదువు మాత్రమేనని ప్రతి విద్యార్థి గుర్తించుకోవాలన్నారు. ఇవాళ మనం సహాయం తీసుకున్నా భవిష్యత్తులో మరొకరికి సహాయం చేసే స్థాయికి ఎదగాలన్నారు. వీలున్న ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులకు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ చేరుకొన్న కన్వీనర్ జి కె ఈరన్న, మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్

## శిక్షణ తరగతులకు విజయవాడ వెళ్లిన నాయకులు

**రోళ్ల, డిసెంబర్ 14 :**
విజయవాడ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం లో సోమవారం నుంచి రెండు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులకు హిందూపురం పార్లమెంట్ మడకశిర నియోజకవర్గంరోళ్ల మండలం నుంచి మండల కన్వీనర్ జి కె ఈరన్న,మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్ ఆదివారం సాయంత్రమే విజయవాడ చేరుకొన్నారు.రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ పాల్గొని పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేయనున్నారు

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత..**



**బత్తలపల్లి, డిసెంబర్ 14:**
మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని ఆదివారం ఒక ప్రకటనలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతి పత్రాలను అందజేయవచ్చునన్నారు.



మైనార్టీ ఫంక్షన్ హాల్ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

## మైనార్టీ ఫంక్షన్ హాల్ పనుల పర్యవేక్షణ

**ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ..**

**కదిరి, డిసెంబర్ 14:**
కదిరి పట్టణం మదనపల్లి రోడ్‌లో గల మైనార్టీ ఫంక్షన్ మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరిశీలించారు. ఎంత త్వరగా అయితే అంత త్వరగా పనులను పూర్తి చేసి వాడుకులోకి తీసుకురావాలని ఆదేశించారు. అయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.



శ్రీ కెంచమాంబదేవికి పూలతో అలంకరణ.

## శ్రీ కెంచమాంబా దేవికి అభిషేకం

**వెండి హారం అందజేసిన దాతలు..**

**అమరాపురం, డిసెంబర్ 14:**
మండల పరిధిలో గౌడన కుంట గ్రామంలో వెలసిన శ్రీ కెంచమాంబా దేవి ఆలయం. ఆదివారం శ్రీ కేంచమాంబ దేవికి అర్చకులు చిదానంద స్వామి దొడ్డయ్య స్వామి అభిషేకం, ,కుంకుమార్చన, సోడా శోపాచార పూజ, భక్తులకు మహా మంగళహారతి , తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమరాపురం పట్టణానికి చెందిన కెంగీరన్న శివ కుమార్ కూతురు కేంచమ్మ, వెండి హారాన్ని శ్రీ కెంచమాంబా దేవికి కానుకగా అందజేశారు.



కెంచమాంబా దేవికి వెండి హారాన్ని అందజేస్తున్న కెంగీరన్న శివకుమార్ కూతురు కెంచమ్మ

# సనాతన ధర్మ రక్షణే మన కర్తవ్యం

## హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి..

**బత్తలపల్లి, డిసెంబర్ 14:**
హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం, మన సంస్కృతి సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందించడం ప్రతి ఒక్కరి కనీస కర్తవ్యం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన బత్తలపల్లి లోని ఇందిరమ్మ కాలనీలోని బికే ఫంక్షన్ హాల్‌లో సమరసత సేవా ఫౌండేషన్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆధ్యాత్మికవేత్త గుమ్మడి సూర్యనారాయణ రెడ్డి, వక్త చంద్రశేఖర్, సమరసత సేవా ఫౌండేషన్ పుట్టపర్తి సుధాకర్, పొట్లమర్రి ఆదినారాయణ, ధర్మవరం శరత్, గుంజేపల్లి కూరే నారాయణస్వామి, బత్తలపల్లి షరాబు, యోగానంద ఆచారి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రపంచానికే మార్గదర్శి, ఆటువంటి గొప్ప ధర్మంపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడానికి హిందువులందరూ కులమతాలకు అతీతంగా ఏకం కావాలి. ధర్మాన్ని మనం రక్షిస్తే, ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుంది అని పేర్కొన్నారు. దేవాలయాలు కేవలం ప్రార్థనా మందిరాలు మాత్రమే కావని, అవి మన సంస్కృతికి నిలయాలని, వాటి పవిత్రతను కాపాడటంలో భక్తులు చైతన్యవంతులు కావాలని సూచించారు. ముఖ్యంగా ఇతర మతాల వారికి ఆకర్షితులైన వారిని తిరిగి మన మతంలోకి తీసుకురావడం, హిందూ దేవాలయాల సొమ్ముల్ని ఇతర మతాలకి ఇవ్వడాన్ని నిషేధించాలి. నేటి యువత పాశ్చాత్య పోకడలకు లోనుకాకుండా, మన పురాణాలు, ఇతిహాసాల్లోని గొప్పతనాన్ని తెలుసుకోవాలని, నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఉద్దేశంతో జనవరి నుండి ఇంటింటికి ఆర్ఎస్ఎస్, సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందువుల ప్రతి ఇంటికి వెళ్లి మనం ఏ విధంగా ఉండాలి,మన పిల్లల్ని ఎలా పెంచాలి, భావితరాల భవిష్యత్తును ఎలా కాపాడాలి, అనే విషయాన్ని ఇంటింటికి వెళ్లి తెలియజేయాలని నిర్ణయించారు. ఈ హిందూ సమ్మేళనానికి మండలంలోని ప్రతి గ్రామం నుండి సభ్యులు హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు సాకే గోపాల్, కొండారుపల్లి శేఖర్, ఈశ్వర్ చంద్ర ప్రసాద్, కమలాకర్, కొంక కాశప్ప, నెట్టెం రామాంజనేయులు, రామంజి తదితరులు పాల్గొన్నారు.



హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆదినారాయణ,షరాబ్ యోగానంద ఆచారి



సమ్మేళనానికి హాజరైన సభ్యులు

## ఎస్ .ఎం. బేకరీ ప్రారంభం

**మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి..**

**అమరాపురం, డిసెంబర్ 14:**
అమరాపురం బస్టాండ్ ప్రాంతంలో ఎస్.ఎం. బేకరీ నీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీదేవి, శ్రీ సత్యనారాయణ స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ఎస్ .ఎం.బేకరీ యజమాని రవితో మాట్లాడుతూ వ్యాపారం బాగా చేసుకోవాలని, వారు కోరారు. శుభ అభినందనలు తెలిపారు. ఎస్.ఎం. బేకరీ ప్రారంభోత్సవానికి తెలుగుదేశం నాయకులు మాజీ జెడ్పిటిసి నరసింహా మూర్తి ,వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ , డైరెక్టర్ దాదా పీర్ ,డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పే స్వామి, విరూప సముద్రం మంజునాథ్ వలస పంచాయతీ కన్వీనర్ బి. ఎస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అతిథులకు స్వీట్లు పంపిణీ చేశారు.



ఎస్ఎం బేకరీ యజమాని రవి



బేకరీ యజమాని రవితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు రవి సోదరులు

## వైభవంగా నామకరణోత్సవం

**అమరాపురం, డిసెంబర్ 14 :**
అమరాపురం పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు అరుణ హరి లింగేశ్వర రెండవ కుమారుడి నామకరణోత్సవం సిరా రోడ్డులో ఉన్న అయోధ్య ఫంక్షన్ హాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. చిన్నారికి నిస్విత్ వశిష్ట పేరు పెట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, వైయస్సార్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి, సర్పంచ్ వాగేష్, జిల్లా టిడిపి మోర్చా యువ నాయకులు కేఎన్ఎమ్ శివకుమార్, శ్రీ చోళమాంబ దేవి ఆలయ కమిటీ చైర్మన్ శివకుమార్ గౌడ్ మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు హాజరై చిన్నారి చిరంజీవిని ఆశీర్వదించారు. అనంతరం హాజరైన వారికి స్వీట్లు, గిఫ్ట్ బాక్సులు అందజేశారు. తదనంతరం వచ్చినవారి కి విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు గణేష్, తాలూకా బీసీ సెల్ అధ్యక్షులు మారుతి ప్రసాద్, మండల క్లస్టర్ కో కన్వీనర్ మంజు తారక్, సింగల్ విండో డైరెక్టర్ దాదు, టి ఎన్ టి యు తాలూకా ఉపాధ్యక్షులు మహలింగప్ప, వలస నాగరాజు, తాలూకా అఫీషియల్ ఫోకస్ పర్సన్స్ సెల్ నాయకులు దాదా పీర్ తదితరులతో కుటుంబ సభ్యులు , బంధుమిత్రులు పాల్గొన్నారు



నామకరణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.పాల్గొన్న బంధువులు, స్నేహితులు

## చెరువులో కంప చెట్ల తొలగింపు పనుల పరిశీలన

**మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ..**

**అమరాపురం, డిసెంబర్ 14:**
అమరాపురం చెరువును కృష్ణ జలాలతో నింపాలనే దృఢ సంకల్పంతో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీర్వాదంతో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు , టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి కృషి పట్టుదలతో ఉన్నారు. ఈ నేపధ్యంలో అమరాపురం చెరువుకు కృష్ణ జలాలు హంద్రీనీవా పథకం ద్వారా తీసుకురానున్నారు. అందులో భాగంగా ఆదివారం చెరువులో కంప చెట్లను తొలగిస్తున్న పనులను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరిశీలించారు. గత టిడిపి ప్రభుత్వంలో మడకశిర నియోజకవర్గానికి కృష్ణ జలాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దక్కింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిట్టచివర ఉన్న అమరాపురం చెరువుకు కృష్ణా జలాలు తరలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర బీసీ సెల్ అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయ కుమార్, మండల వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్,, మండల డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు హనుమంతు, తెలుగు యువత నాయకుడు నాగోనపల్లి మంజునాథ్,, వలస పంచాయతీ కన్వీనర్ బి.ఎస్. నాగరాజు, విరప సముద్రం మంజునాథ్, మద్దనకుంట రఘు పాల్గొన్నారు.



అమరాపురం చెరువులో కంప చెట్లను తొలగించే పనులను పారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



కంప చెట్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్. అమరాపురం చెరువు వద్ద తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు.



హిందూ సమ్మేళనం గోడ పత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

## 20న అమరాపురంలో హిందూ సమ్మేళనం

**కరపత్రాలు విడుదల..**
**హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి..**

**అమరాపురం, డిసెంబర్ 14:**
హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 20న శ్రీ సరస్వతీ విద్యా మందిరం వేదికగా మధ్యాహ్నం 3.30 గంటకు హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు ఏ.ఎం. శివకుమార్ గౌడ్, కార్యదర్శి నాగభూషణ్. తెలిపారు. ఈ మేరకు కరపత్రాలు విడుదల చేశారు. ముఖ్య అతిథులుగా కర్ణాటక రాష్ట్రం తుంకూరు జిల్లా సిద్దర బెట్ట బాలేవన్నూరు శాఖ మఠం పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీరభద్ర శివాచార్య స్వామీజీ, పావగడ శ్రీ రామకృష్ణ సేవ ఆశ్రమం శ్రీ స్వామి జపానంద మహారాజ్, బెంగుళూర్ క్షేత్ర కార్యవాహ ప్రధాన వక్త ఎన్. తిప్పేస్వామి హాజరవుతారన్నారు. హిందూ బంధువులు హాజరై హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షులు ఏ. ఎం.. శివకుమార్ గౌడ్, కార్యదర్శి నాగభూషణ్ తెలిపారు. మండలంలో పుల్లికుంట, వలస వీరాపురం తమ్మడేపల్లి, గౌడనకుంట ,దేవగానపల్లి, నాగోనపల్లి ,హుదుగూర్, కాచికుంట, హల్కూర్ , చిట్టనడు గ్రామాల ప్రజలు హాజరుకావాలని వారు కోరారు.





విజయవాడ శ్రీ కనకదుర్గా దేవిని దర్శించుకున్న అమరాపురం మండల కన్వీనర్ కృష్ణమూర్తి , మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు

## శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్న నాయకులు

**మండల కన్వీనర్ కృష్ణమూర్తి..**
**మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు..**

**అమరాపురం, డిసెంబర్ 14:**
విజయవాడ కొండపై వెలసిన శ్రీ కనకదుర్గాదేవిని అమరాపురం మండల్ కన్వీనర్ కృష్ణమూర్తి ,మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆదివారము ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . అలాగే విజయవాడలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధిపై రెండు రోజులు శిక్షణ కార్యక్రమానికి మండల్ కన్వీనర్ కృష్ణమూర్తి మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు వెళ్లినట్లు తెలిపారు. విజయవాడ మంగళగిరి సెంట్రల్ పార్టీ కార్యాలయము నందు సోమవారం, మంగళవారం రెండు రోజులు శిక్షణ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారని వారు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరవుతారని పార్టీ అభివృద్ధిపై విధులు, బాధ్యతలపై శిక్షణ ఉంటుందని వారు తెలిపారు.

## శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల

అమరాపురం, డిసెంబర్ 14:
టీ.డీ.పీ. సోషల్ మీడియా కోఆర్డినేటర్ శివరాజ్ వివాహము సిరా పట్టణంలోని సిరిగంధ ప్యాలెస్ నందు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పాల్గొన్నారు. అనంతరం అమరాపురం మండలం వి. అగ్రహారంలో ఒక వివాహానికి హాజరై నవ వధూవరులను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మడకశిర బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్ వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ నాయకులు కార్యకర్తలు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, వలస పంచాయితీ కన్వీనర్ బిఎస్ నాగరాజు, వి. అగ్రహారం పంచాయతీ కన్వీనర్ నవీన్ కుమార్, మద్దనకుంట రఘు, విరూప సముద్రం మంజునాథ్, ఎల్.ఐ.సి. నాగరాజు, ధనుంజయ పాల్గొన్నారు.,



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నాయకులు

## యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి

**సి.ఐ.టి.యు డిమాండ్..**

**రోళ్ల, డిసెంబర్ 14 :**
నియోజకవర్గంలోని ఐదు మండలాల యానిమేటర్ లా సమస్యలను పరిష్కరించాలని సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులేసు,సిఐటియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆదివారం మండలంలోని కొత్తపాళ్యం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలొ వివోఏల సంఘ సభ్యుల సమావేశాన్ని శివరామి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్బంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ వివోఏలతో ఇతర పనులు చేయించకూడదని గత నాలుగైదు నెలల నుండి పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిదంగా ఇన్సూరెన్స్ జీతం పెంపుదల రాజకీయ వేధింపులు ఆపాలని కార్మిక ఉద్యోగుల సమస్యలపై ఈ నెల డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు అఖిలభారత సిఐటియు 18వ మహాసభలు జరుగుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా 2500 మంది ప్రతినిధులు మహాసభకు హాజరవుతున్నారని ఆ మహాసభలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ఉద్యోగుల వ్యతిరేక విధానాలపై చర్చ జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు మహాసభకు తరలి రావాలని అదేవిధంగా రేపు పుట్టపర్తిలో జిరిగే కార్మిక కర్షక భవనంలో జరిగేటటువంటి జిల్లా వీవోఏల సంఘ సభ్యుల సమావేశానికి సత్యసాయి జిల్లా వివోఏల సంఘం సభ్యులు అందరూ కూడా హాజరు కావాలని తెలియజేశారు.ఈ సమావేశానికి వివోఏల సంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కే.ధనలక్ష్మి హాజరవుతున్నారన్నారు అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చి అమల్లోకి తెచ్చిందని దీని వలన కార్మిక చట్టాలను నిర్వీర్యమై పెట్టు బడుదారులకు యజమానులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు మార్చిందని దీన్ని మొత్తం కార్మిక ఉద్యోగులందరూ కూడా వ్యతిరేకించాలని దీనిపై కూడా దేశవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కే.వి.పి.ఎస్.కే రామాంజనేయులు,వివోఏల సంఘం జిల్లా అధ్యక్షులు డి.హెచ్ రాయుడు ఐదు మండలాల వివోఏ నాయకులు పాల్గొన్నారు..



మహాసభ కరపత్రాలను విడుదల చేస్తున్న సి ఐ టి యు నాయకులు



పోలీసు స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై నిరంజన్ రెడ్డి

# సత్ప్రవర్తనతో శాంతియుతంగా జీవనం కొనసాగించాలి

**రౌడీషీటర్లకు ఎస్సై నిరంజన్ రెడ్డి కౌన్సెలింగ్ ..**

**పెద్దకడబూరు, డిసెంబర్ 14 :**
సత్ప్రవర్తనతో శాంతియుతంగా జీవనం కొనసాగించాలని ఎస్సై నిరంజన్ రెడ్డి సూచించారు. ఆదివారం పెద్దకడబూరులోని పోలీసు స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రౌడీషీటర్లుగా నమోదైన వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవనం కొనసాగించాలని హితవు పలికారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొడవలు, ఘర్షణలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా శాంతియుతంగా జీవించాలని తెలిపారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలిగితేనే మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై శివరాములు పాల్గొన్నారు.



బనవాసి సీఎస్ఐ సంఘంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

# బనవాసి సీఎస్ఐ సంఘంలో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు

**ఎమ్మిగనూరు, డిసెంబర్ 14:**
ఎమ్మిగనూరు మండల పరధిలో బనవాసి గ్రామం లో సి ఎస్ ఐ సంఘము ఆధ్వర్యంలో సెమీ క్రిస్మాస్ వేడుకలు ఘనంగా జరగాయి పాస్టర్ విజయ్ మాట్లాడు తూ లోకరక్షకుడుమీ కొరకు పుట్టియున్నాడు అన్నారు ముందుగా కేక్ కట్ చేసారు డిసెంబరు 25 న ప్రపంచంలో క్రైస్తవులకు పెద్దగా పండుగ తెలియజేశారు క్రిస్టమస్ రోజున సంబరాలు జరుపుకుంటున్నరు గ్రామంలో సెమి క్రిస్టమస్ పాస్టర్ చేతుల మీదుగా కొవ్వొత్తుల వెలిగించి సంఘ పెద్దల మూలకు తలకాయని పాస్టర్ విజయ్ తెలిపారు సంఘ కాపరి పురుషోత్తం సంఘ పెద్దలు వినోద్ కుమార్ మోహన్ బాబు ఈరన్న ట్రెజరర్ నరసన్న యవనస్తులు భాస్కర్ సందీప్ కుమార్ పాల్గొన్నారు.



బనవాసి సీఎస్ఐ సంఘంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

# కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని జయప్రదం చేయండి


**కామరాజ్ హరీష్..**



**అమరావతి, డిసెంబర్ 14:**
ప్రభుత్వ మెడికల్ కాలేజిల ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల మద్దత్తు కూడ కట్టేందుకు కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో నిర్వహించిన నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 4 లక్షల 31వేల పై చిలుకు సంతకాలను స్వీకరించినట్లు ఎన్టీఆర్ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కామ్రాజ్ హరీష్ కుమార్ ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు ఈ సందర్భంగా కామరాజ్ హరీష్ కుమార్ మాట్లాడుతూ పేదవాడికి ఉచిత వైద్య విద్య అందించేందుకు నాడు జగన్ మోహన్ రెడ్డి గారు రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లను నిర్మించాలని సంకల్పించి 5 మెడికల్ కాలేజ్ లను ప్రారంభించడం కూడా జరిగిందని కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లను ప్రైవేటీకరణ చేయడానికి పిపిపి విధానాన్ని తీసుకువచ్చి పేదవాడికి వైద్య విద్యను దూరం చేస్తున్నారన్నారు.మెడికల్ కాలేజ్ ల ప్రైవేటీకరణ ద్వారా కోట్ల రూపాయలు దోచుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు.మా అధినేత జగన్ మోహన్ రెడ్డి గారి పిలుపు మేరకు జిల్లా లో ప్రతి నియోజకవర్గంలో స్వీకరించినటువంటి సంతకాల పత్రాలను నియోజకవర్గ ఇంచార్జ్ లు పార్టీ శ్రేణులతో కలిసి ఎన్టీఆర్ జిల్లా పార్టీ కార్యాలయంలో అప్పజెప్పడం జరుగిందని తెలిపారు. సోమవారం నాడు ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చినటువంటి సంతకాలు స్వీకరించిన పత్రాలను పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలించే కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు ఏడు నియోజకవర్గాల ఇన్చార్జిల నాయకత్వంలో ఏలూరు రోడ్లో చుట్టూ గుంట సెంటర్ వద్ద ర్యాలీ ప్రారంభం అయ్యి శిఖమని సెంటర్ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కావున వివిధ నియోజకవర్గలలో ఉన్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పదాధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు.ఈ నెల 17వ తేదీన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి గారు నాయకత్వంలో గవర్నర్ గారికి కోటి సంతకాల పత్రాలను అందజేయడం జరుగుతుందని కావున పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# ఏ టేల్ ఆఫ్ టూ స్టేట్స్ పుస్తకం ఆవిష్కరణ

**హైదరాబాద్, డిసెంబర్ 14:**
ప్రముఖ జర్నలిస్టు ఐ.వెంకట్రావు రాసిన ఏ టేల్ ఆఫ్ టూ స్టేట్స్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. 'విలీనం - విభజన' పేరిట ఎన్.అనురాధ తెలుగులోకి అనువదించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విలీనం, విభజన అంశాలతో పాటు రెండు రాష్ట్రాలను పాలించిన 22 మంది ముఖ్యమంత్రుల పాలనా కాలాన్ని కూడా ఈ పుస్తకంలో ప్రస్తావించారు. పరిశోధకులకు, భవిష్యత్ తరాలకు ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. పుస్తకాన్ని తెలుగులోకి అనువదించిన అనురాధను ముఖ్యమంత్రి అభినందించారు.



# ఆదోని జిల్లా సాధన దీక్షలకు సంఘీభావం

**మాజీ ఎంపి బుట్టా రేణుక ..**

**ఎమ్మిగనూరు, డిసెంబర్ 14:**
విద్యార్థి, యువజన, వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలోని వైయస్సార్ సర్కిల్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు (నాలుగో రోజు) ఆదోని ప్రాంత ప్రజల న్యాయ సాధన లక్ష్యంగా మారాయి. ఈ శాంతియుత పోరాటానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా పార్లమెంటరీ సమన్వయకర్త శ్రీమతి బుట్టా రేణుక, పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ, జిల్లా ఉపాధ్యక్షులు కేఆర్ మురహరి రెడ్డి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న ఆదోని ప్రాంత ప్రజల న్యాయమైన హక్కుల సాధన కోసం విద్యార్థులు, యువజనులు, వామపక్ష నాయకులు ముందుండి పోరాట పథంలోకి రావడం గర్వకారణమని బుట్టా రేణుక అన్నారు. "ప్రాంత అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం, యువత భవిష్యత్తు కోసం ఆదోని జిల్లాగా ఏర్పడాలనే డిమాండ్ ప్రజల గుండె చప్పుడుగా మారిందన్నారు. . ఈ ఉద్యమం కేవలం విద్యార్థుల పోరాటం మాత్రమే కాదు, సమస్త ఆదోని ప్రాంత ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం" అని ఆమె స్పష్టం చేశారు.ప్రస్తుత అధికార పార్టీ నేతలు ఆదోని జిల్లా ఏర్పాటు ఇష్టపడకపోవడంతో ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ, ఎమ్మిగనూరు నియోజవర్గం కావాలని, పత్తికొండ నియోజవర్గం కావాలని చెబుతూ జిల్లా ఏర్పాటుకు అడ్డుపడుతున్నారని బుట్టా రేణుక ఎత్తిచూపారు.ఇలాంటి ప్రయత్నాలు ప్రజలు తిప్పికొడతారు రిలే నిరాహార దీక్షల్లో ముఖ్యమైన విద్యార్థి, యువజన, ప్రజా, వామపక్ష సంఘాల నేతలు మొహరంగా ఆదోని జిల్లా కావాలని పోరాడుతున్నారు. ఈ ప్రజా అభిప్రాయానికి మేము కట్టుబడి



మాట్లాడుతున్న మాజీ ఎంపి బుట్టా రేణుక

ఉంటామని, వైసిపి ప్రజల వెంట నడుస్తుందని" అని ఆమె మొగ్గు చూపారు. వైసిపి ప్రజా అభిప్రాయాల మేరకు ఆదోని జిల్లా ఏర్పాటు డిమాండ్ చేస్తుందని బుట్టా రేణుక తెలియజేశారు.

దీక్షలో కూర్చున్న సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి సత్యన్న, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి బాలరాజు, పట్టణ కార్యదర్శి బాబు, రైతు కూలీ సంఘం నాయకులు ఎల్లప్ప, జేఏసీ నాయకులు బతకన్నా సత్యనారాయణరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు కృష్ణ రఘునాథ కాజా ఆఫ్రిదికి నిమ్మరసం అందజేశారు.



ఆదోని జిల్లా సాధన దీక్షలకు సంఘీభావం ప్రకటించి మాట్లాడుతున్న నాయకులు





కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసున్న నాయకులు. మాట్లాడుతున్న ఎంఎల్ఏ జయనాగేశ్వర రెడ్డి

# ఘనంగా 66వ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

**ఎమ్మిగనూరు, డిసెంబర్ 14:**
ఎమ్మిగనూరు పట్టణంలోని కుర్ణీ కళ్యాణ మండపంలో దివ్యాంగుల సాధికారత ఫోరం" (డిఈఎఫ్) అధ్యక్షులు బిసి నాగరాజు అధ్యక్షతన 66వ "ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట గౌరవ అధిదులుగా శాసనసభ్యులు పిఏసి సభ్యులు డాక్టర్ బి వి జయ నాగేశ్వర రెడ్డి రాష్ట్ర "దివ్యాంగుల కార్పోరేషన్" చైర్మన్ జి. నారాయణ స్వామి, రాష్ట్ర డిఈఎఫ్ గౌరవాధ్యక్షులు మల్లేల ఆల్ఫ్రెడ్ రాజు ఎన్డీఏ కూటమి ప్రముఖ నేతలు, డిఈఎఫ్ కార్యవర్గం సభ్యులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ జయనాగేశ్వర రెడ్డి, చైర్మన్ నారాయణ స్వామి మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారత కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని దివ్యాంగుల సాధికారత సంక్షేమాభివృద్ధికై సీఎం చంద్ర బాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ యువనేత లోకేష్ బాబు ఉన్నతమైన సంక్షేమ ఫలాలు అందించడం జరిగిందని అందులో భాగంగానే మూడు వేల రూపాయలు పెన్షన్ ను ఆరు వేల రూపాయలకు పెంచిందని అదేవిధంగా దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఇంద్ర ధనుస్సు అనే అత్యద్భుతమైన పథకాలు అమలు చేయాలని నిర్ణయించారని తెలిపారు. అదేవిధంగా ఇందులో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ దివ్యాంగులకు ఎల్లప్పుడూ అండగా, దండగా నిలుద్దాం అని పేర్కొన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం దివ్యాంగుల సాధికారతను పూర్తిగా విస్మరించిందని కేవలం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఎఫ్ గౌరవాధ్యక్షులు ఆల్ఫ్రెడ్ రాజు, అధ్యక్షులు బి సి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం. శివశంకర్, కోశాధికారి ఆదిశేషయ్య, మహిళా కన్వీనర్ బాలకుళ్ళాయమ్మ లు మాట్లాడుతూ మా దివ్యాంగుల ప్రధాన సమస్యలు, ఇబ్బందులు, మౌలిక సదుపాయాలు, వసతులు, హక్కులు, రాయితీ, రిజర్వేషన్లు, చట్టాలు, బడ్జెట్ ను సంపూర్ణంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఈఎఫ్ జిల్లా విభాగం నాయకులు, నియోజకవర్గ స్థాయి దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న వికలాంగులు. సన్మానిస్తున్న దృశ్యం



# కన్హా శాంతివనానికి సీఎం చంద్రబాబు

**కన్హా శాంతి వనం అధ్యక్షులు దాజీతో భేటీ**

**అమరావతి, డిసెంబరు 14:**
హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ మండలంలో ఉన్న కన్హా శాంతి వనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు సందర్శించనున్నారు. సోమవారం ఉదయం జూబ్లిహిల్స్‌లోని నివాసం నుంచి బయల్దేరి వెళ్లనున్న సీఎం 11 గంటలకు కన్హా శాంతివనం చేరుకోనున్నారు. ఆశ్రమం అధ్యక్షులు కమలేష్ డి.పటేల్ దాజీ తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రెండు గంటల పాటు శాంతివనంలోని వెల్ నెస్ , మెడిటేషన్ సెంటర్ సహా, యోగా కేంద్రాలను ముఖ్యమంత్రి తిలకించనున్నారు. ట్రీ కన్జర్వేషన్ సెంటర్, రెయిన్ ఫారెస్ట్ కేంద్రం, మెడిటేషన్ సెంటర్, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్టిఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ ను సీఎం సందర్శిస్తారు. అనంతరం శాంతివనం వ్యవస్థాపకులు దాజీ నివాసానికి వెళ్లనున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొత్తం 1400 ఎకరాల్లో కన్హా శాంతి వనాన్ని శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్ ను ఈ ఆశ్రమం కలిగి ఉంది. 8 లక్షలకు పైగా వివిధ జాతుల వృక్షాలతో బయోడైవర్సిటీ కేంద్రంగా ఈ ఆశ్రమం పెద్దఎత్తున పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. మానవ వనరుల్ని గ్లోబల్ లీడర్లుగా తయారు చేసేందుకు ఈ ఆశ్రమం అధ్యక్షులు దాజీ నేతృత్వంలో హార్ట్ ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లీడర్షిప్ ఈ ఆశ్రమం నిర్వహిస్తోంది. కౌశలం పేరిట శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. కన్హా శాంతివనంలోని యోగా, మెడిటేషన్, వెల్ నెస్ సెంటర్లతో పాటు సుస్థిర వ్యవసాయ క్షేత్రాన్ని ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. అనంతరం ఆయన హెలికాప్టర్లో బయల్దేరి అమరావతికి తిరిగి రానున్నారు. మధ్యాహ్నం సచివాలయంలో అధికారులతో వేర్వేరు సమీక్షల్లో పాల్గొనున్నారు. రేపు సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణదినం కార్యక్రమానికి హాజరు కానున్నారు.



# గ్రంధాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్‌కి సన్మానం

**అనంతపురం , డిసెంబర్ 14:**
ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన అనంతపురం ఉమ్మడి జిల్లాల గ్రంధాల చైర్మన్ వడ్డే వెంకట్‌కి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహబూబ్ బాషా శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ బీసీ గుర్తించి పదవి ఇవ్వడం సంతోషకరమైన విషయం అన్నారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీ లను గుర్తించి నామినేట్ పదవులు ఇవ్వాలని అదే మాదిరిగా రానున్న రోజుల్లో రాజకీయాల్లో రిజర్వేషన్ కల్పించి అభివృద్ధికి తోడ్పడాలని ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రివర్యులు లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ జేఏసీ నాయకులు దాసిగాని కుల్లాయప్ప, బుడగ జంగల్ అంజి జిట్ట రామ్మోహన్ గోగుల మూర్తి చిన్న రాము తదితరులు పాల్గొన్నారు .

## గురుకులల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

**విజయవాడ , డిసెంబర్ 14:**
ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో 2026-27 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో 5, 6, 9 తరగతుల్లో చేరేందుకు 2026 ఫిబ్రవరి 22న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని జిల్లాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

# కురుగోడు శ్రీ జగద్గురు సాని ఖాదర్ లింగ స్వామి ఉరుసు



ఉరుసులో పాల్గొన్న నాయకులు

**కౌతాళం, డిసెంబర్ 14:**
కర్ణాటక కురుగోడు గ్రామంలో శ్రీ జగద్గురు సాని ఖాదర్ లింగ స్వామి 4వ ఉరుసు మహోత్సవంలో రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు. దర్గాని దర్శించుకున్న కౌతాళం మండలంలో పలువు రాజకీయ పార్టీ నాయకులు దర్గా పీఠాధిపతులను శాలువాలతో సత్కరించారు. శ్రీ జగద్గురు సాని ఖాదర్ లింగస్వామి ఆశీస్సులు అందించారు.ఈ కార్యక్రమంలో పలువురు కౌతాళం మండలంలో పార్టీ నాయకులు కౌతాళం మండలం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ జగద్గురు సాని ఖాదర్ లింగస్వామి ఉరుసులో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెసు నాయకులు



కురుబోడు శ్రీ జగద్గురు సాని ఖాదర్ లింగస్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు చెన్న బసప్ప దని. కౌతాళం తెలుగుదేశం పార్టీ నాయకులు



మురళి కుటుంబాన్ని పరామర్శిస్తున్న దువ్వూరు టిడిపి పట్టణ ఇంచార్జ్ పాపినేని రాంబాబు

# రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ

**తెదేపా దువ్వూరు పట్టణ ఇంచార్జ్ పాపినేని రాంబాబు.**

**దువ్వూరు, డిసెంబర్ 14:**
ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన దువ్వూరు గ్రామానికి చెందిన మునుగోలు మురళి అనే వ్యక్తి ని ఇంటి వద్ద కు వెళ్లి పరామర్శించిన దువ్వూరు పట్టణ తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ పాపినేని రాంబాబు, ఈ సందర్భంగా మురళి సమస్యను మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి అతని అవసరమైన సీఎం రిలీఫ్ ఫండ్ మరియు ఇన్సూరెన్స్ తో పాటు ప్రభుత్వ పింఛను ఇప్పిస్తామని పాపినేని రాంబాబు తెలిపారు.

# వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై చర్చలు జరపాలి

***పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా..***

**చండీఘర్, డిసెంబర్ 14:**
వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్లతో చర్చలు జరపాల్సిన అవసరం ఉందని పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా అభిప్రాయ పడ్డారు. వార్తా పత్రికలు, న్యూస్ ఏజెన్సీల ఉద్యోగసంఘాల కాన్ఫెడరేషన్ రెండురోజుల వార్షిక సమావేశాలను చండీఘర్ మున్సిపల్ భవన్ లో ఆదివారం ఆయన ప్రారంభించారు. సమావేశానికి కాన్ఫెడరేషన్ అధ్యక్షుడు రాస్ బిహారీ అధ్యక్షత వహించారు. సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చిన ది ట్రిబ్యూన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రుచిక ఎం ఖన్నా వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. ట్రిబ్యూన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ గుప్తా స్వాగతం పలుకుతూ ప్రస్తుతం జర్నలిస్టులు క్లిష్టమైన పరిస్థితులని ఎదుర్కుంటున్న నేపథ్యంలో కాన్ఫెడరేషన్ వార్షిక సమావేశానికి కీలక ప్రాముఖ్యం ఉందన్నారు. కాన్ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ ఎం.ఎస్.యాదవ్ మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమలులోకి రావడంతో వర్కింగ్ జర్నలిస్టుల చట్టం రద్దయ్యిందనీ , దాంతో జర్నలిస్టుల వేజ్ బోర్డు ఉనికిలో లేకుండా పోయిందని అన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని పునరుద్ధరించాలని అందుకు గవర్నర్ తమ పలుకుబడిని వినియోగించాలని కోరారు. సమావేశాలను ప్రారంభించిన పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా మాట్లాడుతూ ప్రజాస్వామ్య మనుగడలో మీడియా పాత్ర కీలకమైనదని కటారియా అన్నారు. స్వాతంత్రోద్యమ కాలంలో పత్రికలు కీలక భూమిక పోషించాయని ఆయన ప్రశంసించారు. వ్యవస్థలో లోపాలను ప్రశ్నించేటట్లు పౌరులను జాగృతం చేయాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందని గవర్నర్ అన్నారు.

ప్రజాస్వామ్యంలో అన్నివర్గాల సమస్యలను వినాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని గవర్నర్ అన్నారు. వివిధవర్గాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వాలు, ప్రజాస్వామ్యంలో కీలకభూమిక పోషిస్తున్న మీడియా సిబ్బంది సమస్యలపై కూడా దృష్టి సారించాలని కోరారు. లేబర్ కోడ్ ల అమలుపై కాన్ఫెడరేషన్ నేతలు లేవనెత్తిన సమస్యను ప్రస్తావిస్తూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను సంబంధిత బాధ్యుల దృష్టికి తీసుకు వెళ్తానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఈ విషయంలో యూనియన్ల అభిప్రాయాలతో పాటు సంబంధిత అన్నివర్గాల అభిప్రాయాలు వినాలని, అన్ని వర్గాలతో చర్చలు జరపాలని, చర్చలద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం తనకు ఉందని గవర్నర్ గులాబ్ చంద్ కటారియా అన్నారు.

ఐ.జే.యూ. అధ్యక్షుడు కే.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షుడు మాట్లాడుతూ లేబర్ కోడ్లను రూపొందించే క్రమంలో బ్రిటిష్ పాలనా కాలం నాటి చట్టాలను మారిన పరిస్థితులకు అనుగుణంగా మారుస్తున్నామని ప్రభుత్వం చెప్పిందని, అయితే అందులో ఎంతమాత్రమూ వాస్తవం లేదని అన్నారు.

# కార్మికులకు అండ సిఐటియు జెండా

## సిఐటియు అఖిలభారత మహాసభలకు విరాళాల సేకరణ..

**బద్వేల్, డిసెంబర్ 14:**
డిసెంబర్ 31 తేదీ నుంచి జనవరి 4 తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ జాతీయ మహాసభలు జయప్రదానికై సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు)పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు. స్థానిక 2వ వార్డ్, శ్రీ జాంబవంతనగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు మాట్లాడుతూ 2025 డిసెంబర్ 31 తేదీ నుంచి 2026 జనవరి 4 వరకు జాతీయ మహాసభలు విశాఖపట్నంలో జరగనున్నాయని,ఈ మహాసభలకు దేశ వ్యాప్తంగా 2 వేల మంది కార్మిక ప్రతినిధులు,10 దేశాల నుంచి కార్మిక సంఘాల నాయకులు హాజరు కానున్నారన్నారన్నారు. జనవరి 4 తేదీన లక్ష మందితో బహిరంగ సభ జరగనుందని తెలిపారు. డిసెంబర్ 27 నుంచి జనవరి 2 తేదీ వరకు సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. సాంస్కృతిక ఉత్సవాలకు ప్రముఖ సినీ నటులు ప్రకాష్ రాజ్,సుద్దాల అశోక్ తేజ, సింగర్ మంగ్లీ మరి కొంతమంది సిని ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. బద్వేలు పట్టణంలో ఉన్న అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జనవరి 4 తేదీన జరగనున్న బహిరంగ సభను, సాంస్కతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. మహాసభల్లో కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్లు రద్దు కోసం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, కనీస వేతనం నెలకు రూ.26,000/-లు ఇవ్వాలనీ, స్కీం వర్కర్లను, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డైలీవేజ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలనీ,బిల్డింగ్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలనీ, బిల్డింగ్ కార్మికుల పెండింగ్ క్లైమ్ లను పరిష్కరించాలని, హమాలీ, ఆటో, ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ, విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగించాలనీ, కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలు ఇవ్వాలనీ, ఓపిఎస్‌ను అమలు చెయ్యాలనీ, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చెయ్యాలనీ మహాసభల్లో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. మహాసభల విజయవంతం కొరకు అన్ని వర్గాల ప్రజలు,కార్మికులు సహాయ సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు.



విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కమిటీ సభ్యులు దియ్యాలహరి, కాలువ శివకుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, ఉపాధ్యక్షులు పత్తూరు యువరాజు, మున్సిపల్ యూనియన్ ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల మహాధర్నా జయప్రదం చేయండి

## వీఆర్ఏల అభివృద్ధికి చొరవ చూపండి.. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్యకు వినతి..

**బద్వేల్, డిసెంబర్ 14:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) లు సుమారు 20వేల మంది పైబడి దశాబ్దాలకాలంగా వెట్టిచాకిరికి గురవుతూ అర్ధాకలితో అలమటిస్తున్న వీఆర్ఏ లను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తిస్తూ "పే స్కేల్" మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకునేలా ఈనెల 16 వ తేదీ విజయవాడలో నగరంలోని మంగళగిరిలో ఉన్న సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే వీఆర్ఏల మహా ధర్నాకు కు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై తమ మద్దతు తెలియజేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి. ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ప్రస్తుత సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య.ను ఆంధ్ర ప్రదేశ్ వీఆర్ఏ జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్లిపోగు నాగేశం. రాష్ట్ర కార్యదర్శి కొమ్ముదీశ్వరయ్య గుజ్జుల ఈశ్వరయ్య కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏ లు అందరూ కూడా ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన అత్యంత పేదలైనని వారి యొక్క కుటుంబాల అభివృద్ధి కోసం వారి సంక్షేమం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చరువ చూపాలని అదేవిధంగా సంక్షేమ విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు అని చెప్పేటటువంటి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీఆర్ఏల సంక్షేమం వైపు ఎందుకు ముగ్గు చూపడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 16వ తేదీ జరిగే "మహధర్నా" కు రాష్ట్రంలోని విఆర్ఏ లు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటాలని తద్వారా సమస్యల పరిష్కారాలకు మార్గం సుగుమం అవుతుందని వారు ఆకాంక్షించారు.



కరపత్రం అందిస్తున్న వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్లిపోగు నాగేశం. రాష్ట్ర కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య.

# బాలుర ఎస్సీ హాస్టల్ సందర్శన

## ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ..

**రామకుప్పం, డిసెంబర్ 14:**
మండల శివార్లలోని బాలుర ఎస్సీ హాస్టల్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సందర్శించారు. ఆదివారం హాస్టల్లోని పరిసరాలను, హాస్టల్ వసతి గృహాలు మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి యోగి క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న భోజన వసతులపై హాస్టల్ సిబ్బందితో చర్చించారు.



పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాల పర్యవేక్షణను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



అనంతరం పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు పర్యవేక్షణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ వెంకట మోహన్, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, డిస్కో చైర్మన్ వి జి ప్రతాప్, టిడిపి మండల అధ్యక్ష మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు సీతాపతి, రామకృష్ణప్ప, రవి రెడ్డి, సత్తి, మంజునాథ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ముంపు బాధితులకు నష్ట పరిహారం అందిస్తాం

## ఇంచార్జ్ తహసీల్దార్ శిరీష..

**అట్లూరు,డిసెంబర్ 14:**



సోమశిల ప్రాజెక్టు జలాశయంలో ముంపునకు గురైన బాధిత కుటుంబీకులకు మరో మారు నష్టపరిహారాన్ని అందిస్తామని ఇంచార్జ్ అట్లూరు తాసిల్దార్ శిరీష తెలిపారు, స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆర్ ఆర్ సౌకర్యాల విషయంలో తమకు న్యాయం జరగలేదంటూ బాధితులు హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు, హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా సర్వోన్నతాధికారి ఆదేశాల మేరకు సోమశిల ప్రాజెక్టు ముంపు బాధితులను గుర్తించి వారి యొక్క పూర్తి వివరాలను పరిశీలించి వారికి పరిహారాన్ని అందించేందుకు కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు,ముంపు రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ,ఆధార్ కార్డు నకలు అవార్డుదారులు తదితరవివరాలు వారి వద్ద ఉంచుకోవాలని తెలిపారు. 16,17,18,19న మద్దూరు, చెండువాయి, ఇరువురు, వరికుంట, ఉప్పుటూరు, జొన్నవరం, రంగంపల్లి, మల్లీ నేని పట్నం, గ్రామాలకు చెందిన ప్రజలకు స్థానిక అట్లూరు శ్రీ శక్తి భవనం నందు రెవిన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. అదేవిధంగా ఆయా సోమశిల ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు శ్రీ శక్తి భవన్ లో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, మరియు గ్రామ రెవెన్యూ సహాయకుల తోటి విచారణ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని కావున అవార్డుదారులు వారి యొక్క వివరాలను సంబంధిత టీమ్ లను సంప్రదించి వారి యొక్క పూర్తి వివరాలను అందజేయాలన్నారు, ఈ అవకాశాన్ని ముంపు బాధిత గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగపరచుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం స్థానిక అట్లూరు మండల తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

# ప్రజా సంక్షేమం, ప్రజాసేవే లక్ష్యం

## డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి..

**బద్వేల్, డిసెంబర్ 14:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అంటూ ఎలా ముందుకు దూసుకుపోతుందో బద్వేల్ నియోజకవర్గంలో ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ నారాయణరెడ్డి అంటున్నారు. తన మన అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరిని ఆప్యాయతగా పలకరిస్తూ తన చిరునవ్వులతో అందరినీ ఆదరిస్తూ ఎదుటివారి కష్టాలు నష్టాలు నాదే అంటూ ప్రజల సమస్యలు పరిష్కారం చేయడమే తన లక్ష్యంగా భావించి ప్రతి ఒక్కరిని కలుస్తూ వారి ఆరోగ్యాల పై అడిగి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లడం తన లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగిపోతున్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి ఆనాడు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ గా బాధ్యతలు ఇచ్చినప్పటి నుండే కాకుండా బాధ్యతలు లేని సమయంలో కూడాఅలాగే బద్వేల్ నియోజకవర్గంలో చురుకుగా తిరుగుతూ అట్లూరు నుండి బద్వేల్ వరకు అన్ని గ్రామాలకు తిరిగి బూత్ కమిటీ లు నియమకల్లో అందరినీ ఒక్కటిగా చేసి ప్రజల మన్నలను ఆనాడే పొందారు. అట్లూరు మండలం తోపాటు బద్వేల్ మండలాలల్లో తన పాత్ర ఎంతో పోషించి తెలుగుదేశం పార్టీ బలోపేతం చేశారు. కానీ కొంతమంది తనను ఎదగకుండా తొక్కే ప్రయత్నం చేసిన తనకున్న తెలివితేటలతో ముందుకు దూసుకునే పోతున్నారు.

తన క్రిషి ఇన్ఫ్రాటెక్ కంపెనీలో సుమారు 2000 మందికి పైగా యువతకు జీవనోపాధి కల్పించారు. సుమారు వంద మందికి పైగా సబ్ కాంట్రాక్టర్లు పనులు కల్పించడం ద్వారా పార్టీ పరంగా వారిని నిలదొకునెందుకు సహాయం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఏనాడు వంద రూపాయలు కూడా పార్టీ నుండి ఆశించకుండా పార్టీ కోసం పనిచేయడం అంటే ఆయనకు ఎంతో ప్రీతిపదం. అదేవిధంగా అందరినీ ఆప్యాయతంగా కలుపుకొని అందరూ మనవాళ్లే అంటూ కలుపుకోరు తనం ఉన్న వ్యక్తి మంచూరు సూర్యనారాయణ రెడ్డి, తెలుగుదేశం పార్టీ అంటే తనకు పిచ్చి పార్టీ కోసం రాత్రి పగలు కష్టపడి పార్టీ ఇచ్చిన పనిని సక్రమంగా చేసి పార్టీ బలోపేతానికే తన లక్ష్యంగా పనిచేసే వ్యక్తిగా నేడు ఎదగాడు అనడంలో ఎటువంటి సందేహమే లేదు. ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమాయే విధంగా చూడడమే ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రజలకు ఎంతటి కష్టాలు నష్టాలు వచ్చిన వారిని ఓదారిస్తూ తన స్తోమత దగ్గర ఆర్థిక సహాయం కూడా చేస్తూ ముందుకు దూసుకుపోతున్నారు. అంతే కాకుండా కష్టపడి పనిచేస్తే తెలుగుదేశం పార్టీ తగిన గుర్తింపు నిస్తుంది అంటూ మంచు సూర్యనారాయణ రెడ్డి ముందుకు సాగుతున్నారు.

# సంక్రాంతికి అదనంగా 41 ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, డిసెంబర్ 14:**
సంక్రాంతి పండుగకు తెలుగు రాష్ట్రాల మధ్య అదనంగా 41 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు శనివారం ప్రకటించింది. ఈ రైళ్లకు సంబంధించిన ముందస్తు రిజర్వేషన్లు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యాయని ద.మ. రైల్వే సీపీఆర్వో ఏ. శ్రీధర్ తెలిపారు. ఎక్కువ రైళు సికింద్రాబాద్, వికారాబాద్, లింగంపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడకు, నర్సాపూర్ తిరుపతికి ఉన్నాయి.

# పరమ పవిత్రం తిరుప్పావై వ్రతం

*కర్కటే పూర్వఫల్గుణ్యాం*
*తులసీ కాననోద్భావాం*
*పాండేం విశ్వంభరామ్*
*వందే శ్రీ రంగనాయకీం*

## నేటినుంచి ధనుర్మాసం ప్రారంభం .. వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

సనాతన ఋషులు విష్ణువును స్తుతిస్తూ గానం చేసి అనుభూతి పొందిన ఉదంతాలు వేదాల్లో అనేకం. సర్వవ్యాపకుడు అయిన విష్ణువును అనుభూతి పొందుతూ కీర్తించిన వారు ఎందరో ఉన్నారు. అటువంటి వారిలో 12 మంది ఆళ్వార్లు గా కీర్తి గడించారు. సాధనలో ఆనందం ఇచ్చేది భక్తి మోక్ష సాధనకు పనికి వచ్చేసాధనలో ప్రాధాన్యత భక్తికి ఉంది . దక్షిణ భారతదేశంలో ద్రవిడ దేశంలో 12 మంది ఆళ్వార్లు అవతరించి వివిధ ప్రాంతాల్లో అర్చామూర్తిగా ఉన్న భగవంతుని కల్యాణ గుణగణాలను కొనియాడుతూ అనుభూతి చెందారు.

దక్షిణ భారతదేశంలో పాండియదేశంలో మార్కండేయాది మహామునుల ప్రార్థన మేరకు విల్లిపుత్తూరు గ్రామంలో వటపత్రశాయిగా అవతరించారు మహావిష్ణువు. అదే గ్రామంలో ఒక మహానుభావుడు విష్ణువును మనసులో నింపుకొని స్వామికి నిత్యం పూలకైంకర్యం చేసుకుని జీవించేవాడు. అందువల్ల అతన్ని అందరూ విష్ణుచిత్తుడు అనేవారు. వయసు మీద పడినా , సంతానం లేదని దిగులు ఉన్నా అది బయటపడకుండా తాను నిత్యం కొలిచే వటపత్ర సాయి పై మనసు లగ్నం చేసుకొని పూజకు నిమగ్నం అయ్యేవాడు విష్ణుచిత్తుడు. ఆయన ఒకనాడు పూలవనంలో పాదులు తవ్వుతుండగా ఆండాళ్ అయోనిజగా ఆయనకు దర్శనం ఇచ్చింది. ఆరోజు కలియుగం 97 వ సంవత్సరం నెల నామ సంవత్సర ఆషాడ శుద్ధ చతుర్దశి మంగళవారం పుబ్బ నక్షత్రంతో కూడి ఉన్న రోజు. భగవంతుని ప్రసాదంగా భావించి ఆ బాలికను తన అర్ధాంగికి అందజేశాడు దిష్టి చిత్తుడు ఆమెకు గోదా అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచసాగారు. విష్ణుచిత్తుని ఇంటిలో ప్రతిరోజు భగవన్నామ స్మరణ, ప్రవచనాలు, గోష్టితో కాలం గడిచేది. చిన్నతనం నుంచి పూలమాలికలు అల్లడంలో తండ్రికి సహకరించేది గోదా. తండ్రి వెంట ఆలయానికి వెళ్లడం ఇంటి వద్ద దిష్టితత్వంపై జరిగే చర్చల్లో తండ్రిని అనునయిచేది. వైష్ణవులందరూ గానం చేస్తున్న దివ్య మంగళ స్వరూపం పట్ల ఆమె అనురాగం పెంచుకుంది. యుక్త వయస్సు వచ్చిన తర్వాత అది ప్రేమగా మారి, తెలియకుండానే స్వామిని పొందాలనే కోరిక ఆమెలో బలీయమైంది. స్వామికి తాను భార్య కాగలనా అను భావంతో నిరంతరం మనసు వటపత్రశాయి పైనే లగ్నం చేసేది. ఏ పని చేసిన స్వామిని తలుచుకునేది. ఎంతో ప్రావీణ్యంతో తులసిమాలలు అల్లేది స్వామికి. ఎవరూ చూడకుండా ఆ మాలలు ముందుగా తాను ధరించి స్వామికి భార్య అగుటకు తగుదునా? తన అందాన్ని నిలువుటద్దం ముందు చూసుకొని పూలమాలలను బుట్టలో పెట్టేది. ఇలా రోజూ జరుగుతున్నా ఒకనాడు అల్లిన తులసి మాలలు ధరించి ఆపై వాటిని స్వామి కైంకర్యానికి బుట్టలో పెట్టడం విష్ణుచిత్తుని కంట పడింది. దీంతో అతను నిర్ఘాంతపోయి 'మహాపరాధం చేశావు తల్లి ' స్వామిని శరణ వేడుకుంటానని గోదా పట్ల కోపగించుకుని ఆనాడు అల్లిన మాలలు స్వామికి చేరవేయలేదు. ఆనాడు రాత్రి విష్ణు స్వప్నంలో వటపత్ర సాయి కనిపించి ఈనాడు ఎందుకు పుష్ప కైంకర్యం చేయలేదని అడగగా తన పుత్రిక చేసిన అకృత్యాన్ని విన్నవించారు. ఆపై పెరుమాళ్ళు ఆనందిస్తూ ఆమె ధరించిన పుష్ప మాలలు తనకు సమర్పించమని ఆనతిచ్చి అంతర్ధానమయ్యారు. వెంటనే విష్ణుచిత్తుడు నిద్ర మేలుకొని గోదాదేవిని పరమ ప్రీతితో ఆలింగనం చేసుకుని పిన్నై కొల్ నిలమామగళ్ కొల్ తిరమామగళ్ కొల్ పిరందిట్టాళ్ నీళాదేవియో, శ్రీదేవియో భూదేవియో ఈ రూపంలో అవతరించావా తల్లీ అని పరి పరి విధాలుగా ప్రస్తుతి చేశారు. ఈ కారణంగా ఆమెకు ఆండాళ్ అని... మాధవునికి కట్టిన పూలమాలలు ముందు తాను ధరించి పిదప పెరుమాళ్ళకు ఒసగినందున శూడికొడుత్త అని తిరునామములు ప్రసిద్ధమయ్యాయి.




విల్లిపుత్తూరులోని తోటి స్నేహితులను గోపికలుగా భావించి వారిలో తాను ఒక గోపికగా ఎంచుకొని కాత్యాయిని వ్రతము ఆచరించింది. 'తిరుప్పావై' 'నాచ్చియార్ తిరుమొజి' అనే రెండు ప్రబంధములు రచించి వాటి ద్వారా తన అభిలాషను సర్వేశునికి విన్నపము చేసినది. గోదాకు యుక్త వయసు రాగానే ఆమె మనోభీష్టం తెలుసుకో గోరి ఒకనాడు ఎవరిని భర్తగా కోరుకుంటున్నావో తెలుపుము అని గోదాను విష్ణుచిత్తుడు అడగగా మానవమాత్రులను పెళ్లాడనని నిక్కచ్చిగా తెలిపింది . మరి ఎవరిని వరించెదవు అని మరోమారు అనగా పెరుమాళ్ళనే పెళ్లి చేసుకుందని చెప్పింది. అది విన్న విష్ణు చిత్తుడు నూట ఎనిమిది తిరుపతులు కదా మరి ఏ తిరుపతిలోని పెరుమాళ్లకు సతివి కాగోరుతున్నావు అని అడిగాడు. అందులకు 108 తిరుపతిలో పెరుమాళ్ళ వైభవం తెలుపుము అని వేడుకొంది. అంత పెరియాళ్వార్ 108 దివ్య క్షేత్రంలో స్వామి వైభవాన్ని వివరిస్తుండగా మధురానగరంలో వేంచేసి ఉన్న శ్రీకృష్ణుని వైభవం వినగానే ఒళ్ళు పులకరించింది ఆమెకు. శేషాద్రివాసుని వైభవం విన్నంతనే వీనులవిదాయెను. అళగర్ స్వామి సౌందర్యాన్ని వివరిస్తున్నప్పుడు గోదా ముఖం ప్రకాశించింది. శ్రీరంగంలో ఉండు రంగేశుని వైభవం చెవిన పడగానే మితిలేని సంతోషం చెందింది. అప్పుడు 108 తిరుపతుల్లో ఎంబెరుమానార్లను తన జ్ఞాన నేత్రంతో దర్శించి శ్రీ రంగనాథుడిని భర్తగా ఎంచుకుంది. తోటి బాలికలను గోపికగా ఎంచుకొని తాను కూడా ఒక గోపికగా భావించి కాత్యాయని వ్రతాన్ని చేపట్టింది.



సౌరమానం ప్రకారం ధనుర్మాసంలో వేకువజామున తాను నిద్ర లేచి ఒక్కొక్క గోపికను నిద్ర లేపి వారితో వ్రతం ఆచరింపజేసి తాను వ్రతాన్ని ఎంతో భక్తి ప్రపత్తులతో ఆచరించింది . ఇలా కొన్నాళ్లు గడిచిన తర్వాత అర్చామూర్తిగా ఉన్న శ్రీ రంగనాథుడు గోదాను అంగీకరించునా అని అందరూ చింతించుచుండేవారు . ఒకనాడు విష్ణుచిత్తుని స్వప్నంలో స్వామి సాక్షాత్కరించి నీ పుత్రికను నేను పాణిగ్రహము చేసుకొందును అని చెప్పి అంతర్ధానం అయ్యెను. అంత స్వామి తన సన్నిధి పరివారము కలలో కనిపించి మీరందరును సకల మంగళ వాయిద్యాలతో చత్ర చామరాధి మర్యాదలతో నా పల్లకి ఎక్కించుకొని శ్రీవిల్లిపుత్తు వరకు పోయి తీసుకురావలెను అని ఆనతిచ్చారు. అంత శ్రీవారి సన్నిధి పరివార జనము శ్రీవిల్లి పుత్తూరు పోయి పెరియాళ్వార్ వారికి స్వామి కలలో చెప్పిన విషయాన్ని విన్నవించారు. నవరత్నాలు పొదిగిన పల్లకి ఎక్కి ఆండాళ్ళు విల్లి పుత్తూరు నుంచి శ్రీరంగము వచ్చుచున్నప్పుడు పరివార జనము, ప్రజలు అంతా గోదాదేవి వేంచేసింది... చూడి కొడుత్తనాచ్చియార్ వేంచేసింది . ఆండాళ్ వేంచేసింది. తిరుప్పావై పాడిన దేవి వేంచేసింది అని స్వామి ముందు ఘోషించగా స్వామి వైభవం ముందు ఇనుమును అయస్కాంతము లాక్కునట్టుగా స్వామి ఆండాళ్లను ఆకర్షించెను . సమస్త జనులు చూస్తుండగా కాళ్ల అందెలు హస్తమునందు కంకణములు శబ్దం చేయుచుండగా హంసగతిన నడిచి నాగ పర్యంకము తొక్కి శ్రీ రంగనాథుని చేరి వారి తిరువడిగా యందు అంతర్భవిచారు. ఆమెను సేవిస్తూ ధనుర్మాసంలో రోజుకు ఒక పాశురం వంతున పాడుతూ తల్లి అనుగ్రహంతో స్వామి కటాక్షాన్ని పొందడానికి మనమూ కృషి చేద్దాం.





**- పీసపాటి సంపత్ కుమార్**
**సీనియర్ జర్నలిస్టు**
**విశాఖపట్నం.**
**సెల్: 93471 09377**



# ఇద్దరితో స్టెప్పులేయించండి



సాధారణంగా అభిమానులు.. హీరోల కోసం ఏదైనా చేస్తారు. హీరోలకు తామెవ్వరమో తెలియకపోయినా వారి పుట్టినరోజులు అన్నదానం, రక్తదానం, పాలాభిషేకం, పూలాభిషేకం చేస్తూ ఉంటారు. కానీ, అభిమానుల కోసం హీరోలు ఏం చేశారు.. ? ఎప్పటి నుంచో అందరిని తొలుస్తున్న ప్రశ్న. అభిమానుల వద్దకు వెళ్లి మాట్లాడడం, ఫోటోలు ఇవ్వడం ఇలాంటి చేస్తారు. వారిని ఆనందపర్చడానికి ఇంతకు మించి ఏం చేస్తారు అంటే.. ఒకప్పుడు అభిమానులు తమలో చూసింది.. తిరిగి ఇస్తున్నారు.అదెలా సాధ్యం అంటే.. ఒకప్పుడు తమ అభిమాన హీరో డ్యాన్స్ వేస్తే థియేటర్ లో రచ్చ చేసే అభిమానులు.. ఇప్పుడు తమ హీరో డ్యాన్స్ వేయడం మానేశాడు అని తెలిస్తే వారిలో నిరాశ కచ్చితంగా ఉంటుంది. ప్రస్తుతం ఇద్దరు హీరోల ఫ్యాన్స్ ఆ నిరాశతోనే ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. మిగతా హీరోల ఫ్యాన్స్.. మీ హీరోకు డ్యాన్స్ వేసే సత్తా లేదు అని గేలిచేస్తున్నా ఏమి మాట్లాడకుండా సైలెంట్ గా ఉంటున్నారు. ఆ ఇద్దరు హీరోలు ఎవరో కాదు పవన్ కళ్యాణ్, ప్రభాస్. కొన్నేళ్లుగా వీరిద్దరూ డ్యాన్స్ కి దూరంగా ఉన్నారు. ప్రభాస్ యాక్షన్ సినిమాలతో వస్తున్నాడు. సాంగ్స్ ఉన్నా కూడా అందులో నడవడం తప్ప స్టెప్పేసింది లేదు. సేమ్ పవన్ కూడా ఏదో ఒక మెసేజ్ ఓరియెంటెడ్ కథతో వస్తున్నాడు. సాంగ్స్ లో కూడా పవన్ కనిపించడం తప్ప స్టెప్పులు వేసేది ఉండదు. దీంతో ఇతర హీరోల ఫ్యాన్స్ ముందు పవన్, ప్రభాస్ ఫ్యాన్స్ తల వంచుకోవాల్సి వస్తుంది. వీరిద్దరితో సినిమాలు తీసే డైరెక్టర్స్ ఎక్కడ కనిపించినా ఫ్యాన్స్ తమ హీరోలతో స్టెప్ వేయించాలని కోరుతున్నారు. ఇక ఫ్యాన్స్ కోసం దేనికైనా రెడీ అనే ఈ హీరోలు ఎట్టకేలకు వారి కోరికను నెరవేర్చారు. ప్రభాస్.. ది రాజాసాబ్ సినిమాలో రెబల్ సాబ్ కి కాలు కదిపి షేక్ చేశాడు. ఎప్పుడో ఈశ్వర్ లో డార్లింగ్ ఇలా మాస్ డ్యాన్స్ వేయడం చూసాం.. ఇప్పుడు మళ్లీ చూస్తున్నామని రెబల్ ఫ్యాన్స్ సంతోషంతో గంతులు వేశారు. ఇక దీనిని సాధ్యమయ్యేలా చేసిన మారుతీకి థాంక్స్ చెప్పుకొచ్చారు.ఇప్పుడు పవన్ వంతు వచ్చింది. ఉస్తాద్ భగత్ సింగ్ లో దేఖ్ లేంగే సాలా సాంగ్ కి పవన్ వేసిన స్టెప్స్ నెవ్వర్ బిఫోర్ అన్నట్లు ఉన్నాయి. పవన్ నిజంగా ఇంత డ్యాన్స్ వేశాడా అని అభిమానులే షాక్ అవుతున్నారు. వీరిద్దరూ తమ అభిమానుల కోసం ఎంతో రిస్క్ చేసి ఈ సాంగ్స్ చేశారు. నిజంగా వీరు స్టెప్పేస్తే భూకంపమే అని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. దీంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ లో ఉన్నారు.మరి ఈ రెండు సినిమాలతో ఈ ఇద్దరు హీరోలు ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి.

# అదే చివరి రోజనుకున్న.. శత్రుఘ్నసిన్హా



నటన, రాజకీయాలు రెండింటిలోనూ ఆయన తన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా నిలదొక్కుకోవడం విశేషం. ఆయన కుమార్తె సోనాక్షి సిన్హా సైతం బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. ఈ క్రమంలోనే తన జీవితంలో ఎదురైన ఒక భయంకరమైన అనుభవాన్ని సీనియర్ నటుడు శత్రుఘ్న సిన్హా గుర్తుచేసుకున్నారు. దొంగతనాలు, దాడులు ఎక్కువగా జరిగే రోజుల్లో న్యూయార్క్ నగరంలో తాను ఎదుర్కొన్న ఆ ఘటన తనను తీవ్ర భయానికి గురి చేసిందని చెప్పారు. ఆ రోజు తన జీవితంలో చివరి రోజేనని కూడా అనిపించిందని.. అయితే అనుకోని విధంగా ధర్మేంద్రతో కలిసి నటించిన ఒక సినిమా తన ప్రాణాలను కాపాడిందని ఎమోషనల్ అయ్యారు. శత్రుఘ్న సిన్హా మాట్లాడుతూ.. న్యూయార్క్‌కు వెళ్లినప్పుడు తాను రాడిసన్ హోటల్‌లో బస చేశానని తెలిపారు. అదే ప్రాంతంలో నివసిస్తున్న తన స్నేహితురాలు ఒక రోజు డిన్నర్‌కు ఆహ్వానించడంతో ఆమె ఇంటికి వెళ్లానని.. డిన్నర్ అనంతరం షాపింగ్ చేసి తిరిగి హోటల్‌కు బయల్దేరినట్లు వివరించారు. అప్పటికే అర్ధరాత్రి ఒంటి గంట దాటడంతో ఆమె తనను కారులో తీసుకొచ్చి ఒక చోట దింపి, అక్కడి నుంచి కొద్దిదూరం నడిస్తే హోటల్ వస్తుందని చెప్పి వెళ్లిపోయిందన్నారు.అయితే బ్యాగ్ నిండా ఖరీదైన వస్తువులతో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న తనకు గంటసేపు నడిచినా హోటల్ కనిపించలేదని చెప్పారు. చుట్టూ చూస్తే అన్ని దారులూ ఒకేలా కనిపించడంతో పాటు, ఆ ప్రాంతం దొంగలకు ప్రసిద్ధి చెందినదని అప్పట్లో పేరు ఉండటంతో భయం మరింత పెరిగిందన్నారు. ఒక వ్యక్తిని హోటల్‌కు దారి అడిగితే అతడు విసుగ్గా వెళ్లిపోయాడని.. చీకటి, నిర్మానుష్య వాతావరణంలో తనకు అదే చివరి రోజు అనిపించిందని శత్రుఘ్న సిన్హా గుర్తుచేసుకున్నారు.ఆ సమయంలో ఒక్కసారిగా ఒక కారు తన ముందుగా వెళ్లిందని, అందులో దోపిడీ దొంగలు ఉన్నారేమోనని అనుమానం వచ్చిందన్నారు. తనను చంపి, బ్యాగ్‌లో ఉన్న విలువైన వస్తువులు తీసుకెళ్తారని భావించి భయం రెట్టింపు అయిందని తెలిపారు. కానీ అనుకోని విధంగా ఆ కారులోని డ్రైవర్ బయటకు వచ్చి తనను గుర్తుపట్టడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ఆ డ్రైవర్ తాను ధర్మేంద్రతో కలిసి నటించిన పంజాబీ చిత్రం 'పుట్ జట్టన్ దే'లో నటించానని గుర్తించి మాట్లాడాడని శత్రుఘ్న సిన్హా చెప్పారు. ఆ ప్రాంతం చాలా ప్రమాదకరమని హెచ్చరించిన అతడు, వెంటనే తన స్నేహితులను పిలిపించి శత్రుఘ్న సిన్హాను కారులో ఎక్కించుకొని సురక్షితంగా హోటల్ వద్ద దింపేశాడని వివరించారు. కృతజ్ఞతగా వారికి డబ్బులు ఇవ్వాలని ప్రయత్నించినా వారు నిరాకరించారని, ఆ మానవత్వాన్ని తాను జీవితాంతం మర్చిపోలేనని అన్నారు.

# దండోరా..దండోరా సాంగ్

దండోరా.. దండోరా... అంటూ సాగే 'దండోరా...' మూవీ టైటిల్ సాంగ్‌ను మేకర్స్ శనివారం విడుదల చేశారు. మార్క్ కె రాబిన్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ సినిమాలోని, ఈ పాటను కాసర్ల శ్యామ్ రాశారు. ఆంథోని దాసన్, మార్క్ కె.రాబిన్ పాటను పాడారు. సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజల బాధలను తెలియజేసేలా సాగే ఈ పాట చాలా ఎమోషనల్‌గా, హార్ట్ టచింగ్‌గా ఉంది. కలర్ ఫొటో, బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న చిత్రమిది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు పాత్రధారులు. మురళీకాంత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 25న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిల ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని దండోరా సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నారు. ఈ సినిమాకు రిలీజ్ కంటే ముందే బిజినెస్ పూర్తి కావటం విశేషం. నైజాంలో మైత్రీ మూవీస్ సంస్థ రిలీజ్ చేస్తుంటే.. ఆంధ్ర, సీడెడ్, కర్ణాటక ఏరియాల్లో ప్రైమ్ షో రిలీజ్ చేస్తోంది. ఓవర్సీస్‌లో 200కు పైగా థియేటర్స్‌లో సినిమాను అథర్వణ భద్రకాళి పిక్చర్స్ గ్రాండ్ రిలీజ్ చేస్తోంది. ఓవర్సీస్‌లో అయితే డిసెంబర్ 23నే ప్రీమియర్స్ ప్లాన్ చేశారు.




Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.